ప్రజాశక్తి

సోమవారం 4 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఒక్క హాలు...వంద మంది బాలికలు

- ఆ గదిలోనే భోజనాలు
- మరుగుదొడ్లకు చీరే చాటు
- స్నానాల గదికి సగం తలుపులేదు
- కరెంట్ పోతే బోరు నీటికి బయటకు
- చీడికాడ వసతి గృహంలో బాలికలకు లేని రక్షణ
- దశాబ్దానికిపైగా పరాయి భవనంలో కొనసాగింపు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం

సగం విరిగిన తలుపులతో ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, చీడికాడ విలేకరి

ఇది మాడుగుల నియోజకవర్గంలోని చీడికాడ మండల కేంద్రంలోని పాత పోలీసుస్టేషన్ వీధిలో వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం. ఈ వసతి గృహంలో మూడు నుంచి పది తరగతుల పిల్లలు వంద మంది ఉన్నారు. వందమంది పిల్లలకు ఒకటే హాల్. ఈ హాల్లోనే రాత్రిపూట ట్రంకు పెట్టెలన్నీ ఒక పక్కకు పెట్టి నిద్రపోతారు. తెల్లవారిలేచి పెట్టెలన్నీ రెండు, మూడు వరుసులుగా సర్దుకుంటారు. ఒకటి రెండు సంవత్సరాల క్రితం మంజూరైన వసతి గృహం కాదిది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో మంజూరైన ఈ వసతి గృహానికి ఇప్పటికీ శాశ్వత సొంత భవనంలేదు. కనీస వసతుల్లేని అద్దె భవనంలోనే నడుపుతున్నారు. ఆడపిల్లలు ఉండే ఈ వసతి గృహంలో కనీస వసతి సౌకర్యాలు లేవు. సదుపాయాల్లేవు. పరిసరాలు చూసినవారికి ఆందోళనకల్గిస్తాయి. హాల్ కిటికీల నెట్స్ చిరిగిపోవడంతో దోమలతో విద్యార్థులు బాధపడుతున్నారు. మరుగుదొడ్లు, స్నానాల గదులకు వెళ్లాలంటే రాత్రిపూట భయపడుతున్నారు. మరుగుదొడ్లుకు వెళ్లివస్తున్నప్పుడు కనపడకుండా చిరిగిన చీర అడ్డంగా పెట్టుకున్నారు. భోజనశాల లేక బయట వరండాలోనో, వర్షాలు పడితే నిద్రపోయే హాల్లోనే భోజనాలు చేసి తరువాత శుభ్రం చేసుకుంటున్నారు.

ఆరు మరుగుదొడ్లు, నాలుగు స్నానాల గదులున్నాయి. ఇవి సరిపోకపోవడంతో తొందరగాలేచి విద్యార్థులు మిగతా 2లో..

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో...

ఉమ్మడి విశాఖ సమస్యలు విస్మరించారు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రెండు రోజుల ఉత్తరాంధ్ర పర్యటనలో ఉమ్మడి విశాఖ జిల్లా సమస్యలను విస్మరించడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం తీవ్రంగా ఖండించారు. ఉమ్మడి విశాఖలోని పలు ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యనూ ప్రస్తావించకుండా పెట్టుబడులు, సంపద సృష్టి చుట్టే ఉపన్యాసాలున్నాయని విమర్శించారు. అరకు కాఫీ, మిరియాలు, పసుపు పంటలకు మరింత బ్రాండింగ్ మార్కెట్ వృద్ధి, విశాఖ మెట్రో ప్రాజెక్టు రూ.17వేల కోట్లు, నెల్లిమర్ల, భోగాపురం, అనకాపల్లి ప్రాంతాలకు అనుసంధానం చేస్తూ ఔటర్ రింగు రోడ్లు నిర్మాణం, నక్కపల్లి మండలంలో రూ.70వేల కోట్లతో మిట్టల్ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, గంగవరం పోర్టు నుంచి కాకినాడ పోర్టు వరకు అనుసంధానానికి ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మాణం, ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో జరుగుతున్న ప్రాజెక్టులన్నీ ప్రభుత్వ, ప్రయివేట్ ప్రజల భాగస్వామ్యంతో (4పిలు) అభివృద్ధి చేస్తామని చెప్పారని, విశాఖ అభివృద్ధి కన్నా పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధంగా ముఖ్యమంత్రి వ్యవహరించారని తెలిపారు. సిఎం కన్నా సిఇఒ గానే ఆయన వ్యవహారశైలి ఉందని విమర్శించారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని ఉద్ఘాటించిన చంద్రబాబు లక్ష మంది జీవితాలకు ముడిపడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు శాశ్వత పరిష్కారం కోసం ప్రస్తావించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. బ్లాస్ట్‌పర్నేస్-2ను పున:ప్రారంభించి దానికి ఇవ్వాల్సిన ముడిసరుకు గురించిగాని, సెయిల్‌లో విలీనం, సొంత గనులు కేటాయింపు, వర్కింగ్ క్యాపిటల్ గురించి ప్రస్తావించకపోవడం విశాఖ ప్రజలను మోసం చేయడమేనని తెలిపారు. ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను రక్షించకుండా నక్కపల్లిలో ఇంకొక ప్రయివేట్ స్టీల్‌ప్లాంట్‌ను తీసుకొచ్చి ఎన్ఎండిసితో అనుసందానం చేస్తామని ప్రకటించడం చూస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామనడంలో ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందని పేర్కొన్నారు. ఒకవైపున గంగవరం పోర్టును అదానికి ఇచ్చి స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయాలని, స్టీల్‌ప్లాంట్ భూములను అదానికి ఇవ్వడానికి కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ఉన్న ఎస్ఇజెడ్‌ల్లో వేల ఎకరాలు స్థలాలు ఖాళీగా ఉన్నప్పటికీ కొత్తగా ఎస్ఇజెడ్‌లు తీసుకొస్తామని చెప్పి భూములు సేకరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఫార్మాలో జరుగుతున్న ప్రమాదాలు, కార్మికుల భద్రత కోసం పట్టించుకోలేదని, కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి తరలింపు కోసం కనీసం స్పందనలేదని విమర్శించారు.

అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో ఉన్న మిగతా 2లో..

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల ఉపాధి జోలికొస్తే ఆందోళన ఉధృతం

వార్త మెయిన్‌లో..

ఇనాం భూ సమస్యను పరిష్కరించాలి

వార్త 3లో..

చిన్న పిల్లలకు స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి

వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం

వార్త 4లో..

రుషికొండ భవనాలు దేనికి వాడతారు?

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వైసిపి ప్రభుత్వ హయాంలో రుషికొండలో నిర్మించిన భవనాలను దేనికి వాడతారో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేయాలని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ కోరారు. బీచ్ రోడ్డులోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు విజనరీ కాబట్టి ఆ భవనాలు ఎలా వాడాలో ఆయనే ఆలోచించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై చంద్రబాబు ప్రకటన చేస్తారని ఉత్తరాంధ్ర ప్రజలు ఆశించారని, దీనిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో రుషికొండ టూరిజం ప్రాజెక్టు లాంటి నిర్మాణాలు ఎక్కడా లేవని చంద్రబాబు ప్రస్తావించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు తన జీవితంలో ఇటువంటి నిర్మాణాలు నిర్మించలేరన్నారు. రూ.1500 కోట్లు పెట్టి చంద్రబాబు తాత్కాలిక సచివాలయం కట్టారని, వర్షం వస్తే మంత్రుల పేషీల్లో వరదనీరు చేరిందని ఎద్దేవాచేశారు. తాత్కాలిక సచివాలయం పేరుతో ఆయన పెద్ద ఎత్తున దోచుకున్నారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత విశాఖపట్నం పెద్ద నగరం అని, అందుకే విశాఖపట్నాన్ని రాజధాని చేయాలని కోరారు. స్టేట్ గెస్ట్ హౌస్ కట్టాలని వైసిపి ప్రభుత్వం భావిస్తే కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారని తెలిపారు. కేవలం రుషికొండ భవనాలు మాత్రమే కాకుండా ఉద్దానం రీసెర్చ్ సెంటర్, మెడికల్ కాలేజీలు, జిఎంఆర్ ఎయిర్‌పోర్టు వంటివి కూడా ప్రజలకు చూపించాలని కోరారు. పోలవరం నిర్మాణం ఎలా జరుగుతుందో చూపించడానికి రూ.150 కోట్లు వృథా చేశారన్నారు. సూపర్ సిక్స్ అంటూ చెప్పి అమలులోకి వచ్చే సరికి మెలికలు పెడుతున్నారని విమర్శించారు. తల్లికి వందనం లేదు నాన్నకు ఫుల్లుగా ఇచ్చారని ఎద్దేవా చేశారు.

ముందస్తు ప్రణాళికతో ప్రమాదాల నివారణ

జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.రేణుకయ్య

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ముందస్తు ప్రణాళికలతో అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ గడిచిన దీపావళికి ఎటువంటి అగ్ని ప్రమాదాలూ జరగకుండా ఉత్తమ సేవలు అందించామని విశాఖపట్నం జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.రేణుకయ్య చెప్పారు. ఇటీవల జరుగుతున్న ఫార్మా ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు చేపడితే బాగుంటుందో ప్రజాశక్తితో ఆయన ముచ్చటించారు.

విశాఖపట్నం జిల్లా అగ్నిమాపక శాఖ పరిధి ఏమిటి?

విశాఖపట్నం జిల్లా పరిధిలో భవన నిర్మాణ అనుమతులన్నీ జివిఎంసి మంజూరు చేస్తుంది. కమర్షియల్ భవనాలకు 15 మీటర్లు, రెసిడెన్షియల్ భవనాలకు 18 మీటర్ల వరకు అనుమతులు మంజూరు చేస్తుంది. ఆపై ఉండే భవనాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నిమాపక శాఖ అనుమతులు జారీ చేస్తుంది. చిట్టివలస గ్రామం సమీపంలో కొన్ని ప్రాంతాలు నేరుగా అక్కడి అగ్నిమాపక శాఖ పర్యవేక్షణలోకి వస్తాయి.

విశాఖ నగరంలో పెరుగుతున్న జనాభాకు సరిపడా అగ్నిమాపక శకటాలు, సిబ్బంది ఉన్నారా?

విశాఖ జిల్లాలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అగ్ని మాపక శకటాలు అందుబాటులో ఉన్నాయి. సిబ్బంది విషయానికి వస్తే 30 నుంచి 40 శాతం ఖాళీలు ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. త్వరలోనే భర్తీ చేస్తారని ఆశిస్తున్నాం.

ఇటీవల నిర్మితమవుతున్న బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఎలా మంజూరు చేస్తున్నారు?

15 మీటర్లు దాటిన కమర్షియల్ బిల్డింగ్, 18 మీటర్లు దాటిన రెసిడెన్షియల్ బిల్డింగ్‌లకు జివిఎంసి అనుమతులు మంజూరు చేస్తుంది. ఆ పైన నిర్మించే భవనాలకు షరతులకు లోబడి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఒక్క హాలు.. వంద మంది బాలికలు...

కాలకృత్యాలు పూర్తిచేసుకుంటున్నారు. కరెంట్ సరఫరా నిలిచిపోతే నీటి సమస్య తప్పదు. వసతి గృహం బయటవున్న బోరుకు వెళ్లి బకెట్లతో నీరు తెచ్చుకుంటున్నట్లు విద్యార్థులు చెప్పారు. స్నానాల గదుల్లోని ఒక గదికి తలుపు విరిగిపోయింది. సగభాగం తలుపు ఉంది. అయినా వేరే దిక్కులేక చీర అడ్డం పెట్టుకొని స్నానాలు చేస్తున్నట్లు తెలిపారు. మరుగుదొడ్డి ట్యాంకు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయకపోవడంతో దుర్వాసన కొడుతోంది. పిల్లలు ఆ వాసనను భరిస్తున్నారు. పేద పిల్లలు చదువుతున్న వసతిగృహంలో సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయన్న విషయం ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, జిల్లా బిసి సంక్షేమ అధికారికి తెలిసినట్లు లేవు. ఎందుకంటే పేద పిల్లలు చదువుతున్న వసతిగృహాల్లోని సౌకర్యాలను పరిశీలించాల్సిన అవసరం వారికి ఎప్పుడూ రాలేదు గనుక.

ఎవరు పరిశీలించినా తమ పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలకూ, వసతి గృహ పిల్లల సౌకర్యాలకు తేడా కొద్దిగానైనా అర్థమయ్యేది. మనసు కరిగి చదువుకున్న పేద పిల్లలకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఆలోచించేవారు. తీరికచేసుకొని ఒక్క రాత్రైనా ఈ వసతి గృహంలో విద్యార్థులతో పాటు తెల్లవార్లూ ఉంటే వాస్తవాలు అధికారులు, ప్రజాప్రతినిధులకు అర్థమయ్యేవి. కానీ వారి ప్రాధాన్యతల్లో పేద విద్యార్థులు లేరు. వారి చదువులు లేవు. వారికి సౌకర్యాలు కల్పించాలన్న ధ్యాసలేదు. ఇవి కల్పించినా అదనంగా వచ్చే కీర్తి ఏమీ రాదు. అందుకనే ప్రభుత్వాలెన్ని మారినా పేద విద్యార్థుల వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపడ్డంలేదు.

చీడికాడ మండలంలోని తురువోలు బిసి బాలుర వసతి గృహంలోని కొన్ని గదులు వర్షాలకు కారిపోతున్నాయి. భోజన గదిలేక ఇక్కడా విద్యార్థులు వరండాల్లో తింటున్నారు. వర్షాలు పడితే తమ గదుల్లోకి ప్లేట్లు పట్టుకొని వెళ్లి తింటున్నట్లు విద్యార్థులు తెలిపారు. మరమ్మతులు చేయాలని పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కన్పించలేదు.

ఉమ్మడి విశాఖ సమస్యలు విస్మరించారు

అభిజిత్ పరిశ్రమ యాజమాన్యం అక్రమ లే-ఆఫ్ ప్రకటించి 1000 మంది కార్మికులను రోడ్డున పడేసిందని, 5వేల కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని, వారు గతంలో పనిచేసిన జీతం, బోనస్, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై కనీసం ప్రస్తావించలేదని తెలిపారు. ఉత్తరాంధ్రలో వ్యవసాయం తరువాత ప్రధాన జీవనాధారమైన పాడి రైతులు 3.50లక్షల మంది ఉన్నారని, విశాఖ డెయిరీ ఇటీవల కాలంలో ఆవుపాలు సేకరణ ధర లీటరు దగ్గర రూ.3 తగ్గించింది. దీనిపై ఉత్తరాంధ్ర రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నా, దీనిపై కనీసం కూడా ప్రస్తావించలేదని పేర్కొన్నారు.

నక్కపల్లి మండలంలో వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో సేకరిస్తున్న భూములకు నష్టపరిహారం ఇవ్వకుండా రైతులకు, భూములపై ఆధారపడిన కూలీలకు అనేక ఇబ్బందులు పెడుతున్నారని, రైవాడ జలాశయంపై అదాని హైడ్రో గ్రీన్ ఎలక్ట్రిసిటీ ఏర్పాటు చేస్తే అనకాపల్లి జిల్లాకు సాగు నీటికి, విశాఖ జిల్లాకు తాగు నీటికి తీవ్ర విఘాతం కలగనున్న సమస్యపైనా, సుజల స్రవంతి ప్రాజెక్టు గురించి కూడా ప్రస్తావనే లేదని తెలిపారు. రోడ్ల నిర్మాణం జరిగితే సంపద సృష్టించ వచ్చని కొత్త బాష్యాన్ని తెరపైకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి విశాఖ పర్యటనను పరిశీలిస్తే రియల్ఎస్టేట్ వ్యాపారానికి దోహదం చేసేదిగా ఉందని విమర్శించారు.

ముందస్తు ప్రణాళికతో ప్రమాదాల నివారణ

డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎపి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్మెంట్ అనుమతులు మంజూరు చేస్తోంది.

అగ్ని ప్రమాదాల నివారణకు ఎటువంటి అత్యాధునిక పరికరాలు ఉన్నాయి?

తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా లేనటువంటి అడ్వాన్స్డ్ ఎక్విప్మెంట్ విశాఖలో ఉంది. దాని ద్వారా 25 నుంచి 30 అంతస్తుల భవనాలలో అగ్ని ప్రమాదాలను నివారించగలం. గాలి తక్కువగా ఉన్న సమయంలో మాత్రమే దీన్ని ఉపయోగిస్తున్నాం. గాలి ఎక్కువగా ఉన్న సమయంలో దీనిని ఉపయోగించేందుకు ఇంకా శిక్షణ ఇవ్వాల్సి ఉంది. రానున్న రోజుల్లో స్కై స్కేవర్ అనే మరొక అత్యాధునిక జాకెట్లు రానున్నాయి. ఇవి ప్రమాదం జరిగిన సందర్భంలో అపార్ట్మెంట్ల నుంచి కిందికి దూకేందుకు ఉపయోగపడతాయి.

జిల్లాలో అగ్ని ప్రమాదాలు నివారణకు ఎటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

నగరంలో ప్రతి బుధవారమూ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇది కాకుండా నూతన పరిశ్రమలకు, షాపింగ్ మాల్స్లోని ఆసుపత్రులు, సినిమా థియేటర్ల సిబ్బందికి మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. పలు సమస్యాత్మక ప్రదేశాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహిస్తూ అక్కడి వారికి అగ్నిమాపక పరికరాల వినియోగంపై తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. తద్వారా అగ్నిమాపక పరికరాల వినియోగం, ఆస్తి నష్టాన్ని నివారించడం సులభం అవుతుంది.

ఫార్మా ప్రమాదాలు పునరావృతం కాకుండా ఎటువంటి చర్యలు చేపట్టాలి?

పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే అగ్ని ప్రమాద నివారణ పరికరాలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సేఫ్టీ ఆడిట్లు నిర్వహించాలి. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణ నష్టం జరగకుండా కార్మికులు, యజమానులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడం ద్వారా జరుగుతున్న నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చు.

చిన్న పిల్లలకు స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి

ప్రజారోగ్య వేదిక డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్ఎన్.రాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్లో చిన్న పిల్లలకు ప్రత్యేక స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని, అది నీలోఫర్ స్థాయి స్పెషాలిటీ ఆసుపత్రిగా ఉండాలని ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రజారోగ్య వేదిక విస్తృత సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి విమ్స్ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, కెజిహెచ్, విజిహెచ్లో విభాగాల సంఖ్యను పెంచి, మౌలిక వసతులు కల్పించి, సిబ్బంది సంఖ్యను పెంచాలని సమావేశం కోరింది. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా మౌలిక వసతులు, సిబ్బంది సంఖ్య పెంచి, వాటిలో కింగ్ పేషెంట్ సేవలు కూడా కల్పించాలని సమావేశం కోరింది. రాష్ట్ర ప్రజలందరికీ రక్షిత మంచినీరు సరఫరా చేయాలని, పర్యావరణ కాలుష్య నివారణపై బలమైన చర్యలు తీసుకోవాలని సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

సమావేశంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు గత నాలుగేళ్లలో సంస్థ తరపున చేపట్టిన కార్యక్రమాల వివరాలను నివేదిక రూపంలో సమర్పించారు. అనంతరం ఎకనామిక్స్ ప్రొఫెసర్ పద్మ మాట్లాడుతూ, వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని, బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని, వైద్యం, విద్య రెండు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని కోరారు. డాక్టర్ ఎన్.ఎన్.రాజు మాట్లాడుతూ, ప్రజారోగ్యం ప్రభుత్వాలు బాధ్యత అనే నినాదాన్ని ప్రజారోగ్య వేదిక తీసుకొని కార్యక్రమాలు నిర్వహిస్తుండడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. సోషల్ మీడియా వేదికగా, వైద్యరంగం పట్ల ప్రభుత్వ వైఫల్యాలను చేరవేయాలని సూచించారు. డాక్టర్ వై.ఎల్.నరసింగరావు మాట్లాడుతూ, ప్రజారోగ్య వేదికను ప్రతి రంగంలోకి తీసుకువెళ్లాలని, తద్వారా ప్రజలకు చేరువు కావాలని సూచించారు. డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ, ప్రజారోగ్యం బాధ్యతనుంచి ప్రభుత్వం రానురానూ తప్పించుకొని, ప్రయివేటు రంగానికి అప్పగించడం అత్యంత బాధాకరమని, ఇది భవిష్యత్తులో ప్రమాదకరం అని పేర్కొన్నారు. ఆవాజ్ సంస్థ ప్రతినిధి అశ్రాఫ్ మాట్లాడుతూ, ప్రజారోగ్య వేదికతో కలిసి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్ మాట్లాడుతూ, జనాల్లో ఉన్న అనారోగ్యాన్ని పారద్రోలడానికి ప్రజారోగ్య వేదిక కృషి చేస్తుందని చెప్పారు. మెడికల్ యూనియన్ నాయకులు కెవిపి చంద్రమౌళి మాట్లాడుతూ, ప్రజారోగ్య వేదికలో మెడికల్ రిప్రజెంటివ్లు భాగస్వామ్యం ఉందన్నారు. అనంతరం ప్రజారోగ్య వేదిక కమిటీని విస్తృత పరిచారు. కమిటీలో డాక్టర్ శ్రీనివాస్తో పాటు, మెడికల్ రిప్స్ యూనియన్ నుంచి సంజయ్ కుమార్, సురేష్, కళాధర్, అవాజ్ అశ్రఫ్లను కమిటీలోకి తీసుకున్నారు. సమావేశంలో మిడ్డే మీల్స్, ఆశ, అంగన్వాడీ వర్కర్ల యూనియన్లకు నాయకత్వం వహించిన పి.మణి, మెడికల్ రిప్స్ నాయకులు మహేష్, శ్రీనివాస్, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వార్డులో సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

34వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జివిఎంసి 34వ వార్డులో ఆదివారం ఆయన పర్యటించారు. జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, పలు విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ, వీధి దీపాలు, మంచి నీటి గురించి ప్రజలనడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చుటకు ప్రణాళిక సిద్ధం చేశామని ఎమ్మెల్యే చెప్పారు. పర్యటనలో ముఖ్యంగా నేతాజీ నగర్లో నూకాలమ్మ గుడి పునర్నిర్మాణం చేపట్టాలని, కొబ్బరితోటలో ఆర్చ్, దుర్గాదేవి ఆలయ నిర్మాణం చేయాలని, కొబ్బరితోట సచివాలయం పక్కన సామాజిక భవనం ఏర్పాటుచేయాలని, భూపేష్నగర్ సచివాలయం పక్కన ఉన్న స్థలంలో సామాజిక భవనం ఏర్పాటు చేయాలని, లక్ష్మీదేవిపేటలో అమ్మవారి విగ్రహాన్ని ఆధునీకరించాలని, కొబ్బరి తోటలో పార్వతి పుత్ర అసోసియేషన్ వినాయకగుడికి ఆర్థిక సాయం చేయాలని, డాల్ఫిన్ హోటల్ దగ్గర ఉన్న గుడి ఆధునీకరణ చేయాలని, రామకృష్ణా జంక్షన్లో పార్క్ ఆధునీకరణ చేయాలని, యుజిడి కనెక్షన్లు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని, రోడ్లు మరమ్మతులు చేయాలని, కొబ్బరి తోటలో దోబీ ఘాటు మరమ్మతులు, సామాజిక భవనం పనులు పూర్తి చేయాలని, పలు ప్రాంతాల్లో ఆర్చ్లు ఏర్పాటు చేయాలని, శెట్టిబలిజ యాత భవనాలు నిర్మించాలని కోరారు. నిరాశ్రయాలకు భూపేష్నగర్లో కేటాయించిన నిరాశ్రయుల కేంద్రాన్ని వేరొక చోటకు తరలించాలని, బ్రాందీ షాప్ ఏర్పాటు చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

వాక్థాన్లో పాల్గొన్న పిఎన్బి సిబ్బంది

బీచ్ రోడ్డులో పిఎన్బి వాక్థాన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్, సర్కిల్ ఆఫీస్ విశాఖపట్నం ఆధ్వర్యాన విజిలెన్స్ అవేర్నెస్ వీక్లో భాగంగా బీచ్ రోడ్డులో వాకథాన్ నిర్వహించారు. విశాఖపట్నం సర్కిల్ హెడ్ వి.నీలిమ సర్కిల్ ఆఫీస్ ఎమ్సిసి పిఎల్పి.రామ్, శాస్త్ర, స్థానిక బ్రాంచ్ కార్యాలయాల సిబ్బంది ఉత్సాహంగా వాకథాన్లో పాల్గొన్నారు. వాకథాన్ అనంతరం ఆర్కె.బీచ్, ఎన్టిఆర్ విగ్రహం వద్ద అవినీతికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

గ్రీన్ సిటీగా విశాఖ : మేయర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం వద్ద నేచర్ గార్డెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఆమె డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్తో కలిసి మొక్కలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విశాఖ నగరం ఎంతో అభివృద్ధి చెందుతున్న నగరమని, పర్యాటకులు, సందర్శకులు ఎంతోమంది వస్తారని, వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు విశాఖ నగరాన్ని గ్రీన్ సిటీగా అభివృద్ధి పరిచేందుకు కషి చేస్తున్నట్లు చెప్పారు. దీనిలో నగర ప్రజలు, ఎన్జీవోస్, వాకర్ అసోసియేషన్స్, నివాస సంక్షేమ సంఘం సభ్యులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థలు భాగస్వాములై హరిత విశాఖగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మిద్దితోటలు పెంచుకోవాలని సూచించారు. నేచర్ గార్డెన్స్ అసోసియేషన్ సభ్యులు విశాఖ నగరాన్ని పచ్చదనంగా ఉంచేందుకు మొక్కలను పంచడాన్ని అభినందించారు.

నేచర్ గార్డెన్స్ ప్రతినిధి ఐశ్వర్య మాట్లాడుతూ, ఇంట్లో వచ్చే కిచెన్ వ్యర్థాలతో తయారైన కంపోస్టు, తెగుళ్ల నివారణకు కషాయాలు, ద్రావణాలు తామే స్వయంగా తయారు చేసుకొంటామని తెలిపారు. బృందావన్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సహకారంతో నేచర్ గార్డెన్స్ గ్రూప్ సభ్యులు తైవాన్ జామ, నిమ్మ, రాశి, ఉసిరి మొక్కలను సభ్యులందరికీ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నేచర్ గార్డెన్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

బహిరంగ నోటీసు

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నర్సీపట్నం

I.A. No. 241/2023 IN
O.S. No. 5/2017

Between :
దనిమిరెడ్డి రాజేశ్వరి ...వాది
And
1. గుడివాడ కొండబాబు @ బాబులు
S/o లేటు అప్పలనాయుడు, r/at కవలపాడు గ్రామ, సురవరం పోస్ట్, తుని మండలం, కాకినాడ జిల్లా. **...ప్రతివాదులు 1.**

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఈ ప్రతివాదులు పై నర్సీపట్నం I.A. No. 241/2023 IN O.S. No.5/2017 గా దాఖలు చేయడమైనది. అనేక పర్యాయాలు కోర్ట్ వారు నోటీసు జారీ చేసినా, ఈ ప్రతివాది నోటిస్ తీసుకోకుండా తప్పించుకుంటున్నారు. అందులకు చివరిగా ఈ దావా వాయిదా **తేది 28.11.2024** గా ఇచ్చియున్నారు. ఈ తేదీన **ఉదయం గం.10.00లకు** పైన తెలిపిన కోర్ట్లో హాజరు కాగలరు, లేనియడల, ఈ ప్రతివాదులు పై exparte decree ఇవ్వబడును.

మాకిరెడ్డి బుల్లిదొర,
సింగంపల్లి రామలక్ష్మి
న్యాయవాదులు, నర్సీపట్నం.
అనకాపల్లి జిల్లా

IN THE HON'BLE COURT OF 13TH ADDL. DISTRICT JUDGE AT GAJUWAKA
AS /2019 IA 656/2024

Between:
Sri. Paturi Bhaskara Rao,
S/o. Late Elia aged about 52 Years, Employee in Visakhapatnam Steel Plant, Residing at D.No. 31-2-14/49, Flat No. 502, R.K.Towers, Ashok Nagar, Kurmannapalem, Vadalapudi Post, Visakhapatnam-46, Aadhar No. 7613 5405 8915.
...Appellant/1st Dependent

And:
1. Sri. Sabbella Sesha Reddy
S/o. Krishna Reddy, Hindu, aged 30 years, Occupation, Business, resident of Door No. 52- 14-34, New Respuvanipalem, Visakhapatnam-13.
...Respondent/Plaintiff
2. Sri LIC Housing Finance Limited. represented by its Branch Manager, 3rd Lane, Dwarakanagar, Visakhapatnam-16.
...Respondent/2nd Defendant

పై నెంబరు వాజ్యంలో రెస్పాండెంట్ 1 ఐన (Sri Sabbella Sesha Reddy S/o Krishana Reddy) ఐ ఉన్న మీకు పిటీషనర్/అపీలేంట్ గారు కోర్టు ద్వారా ఎన్ని నోటీసులు పంపిననూ మీ నుండీ ఎటువంటి స్పందన లేదు. మీరు ఉద్దేశపూర్వకంగా నోటీసును నిరాకరించినారనీ తెలిసి పిటీషనరు పై కోర్టు వారి అనుమతితో ఈ ప్రకట వేయించి యున్నారు. కావునా మీరు **25-11-2024**న **ఉదయం 10:30 ని॥** స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ పై నెంబరు పిటీషన్లో మీ యొక్క హాజరు అవసరమైయున్నది లేని యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షంగా పై నెంబరు పిటీషను విచారించెదరు.

పిటీషినరు తరపు న్యాయవాది
Sri Krishnam Raju, 9848014809
Sri B.V.M.Krishna, 9866278920
Smt. Anuradha Patnaik,
9704976321
Advocats

ఇనాం భూసమస్యను పరిష్కరించాలి

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం నేత డాక్టర్ గంగారావు

- పర్యాటకం పేరిట తీరాన్ని కబలించే కుట్రలను తిప్పికొట్టాలి
- పద్మనాభం, ఆనందపురం, తగరపువలసల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలి
- సిపిఎం భీమిలి జోన్ మహాసభలో డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి- పద్మనాభం : భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఇనాం భూసమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిపిఎం భీమిలి జోన్ 12వ మహాసభ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలోజరిగింది. మూడేళ్లలో జరిగిన పోరాటాలపై సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్ కార్యాచరణ, ప్రజాఉద్యమాలపై తీర్మానాలు, నిర్ణయాలు చేశారు. సమావేశానికి ముందు సిపిఎం జాతీయ కార్యదర్శి ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా డాక్టర్ గంగారావు మాట్లాడుతూ, సదుపాయం కల్పించాలని కోరారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరిట జరుగుతున్న భూదోపిడీని ఐక్యంగా తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యాటకాభివృద్ధి ముసుగులో సుదీర్ఘ తీరప్రాంతాన్ని కబలించే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను, ప్రభుత్వ భూములను అదానీ వంటి కార్పొరేటర్లకు కట్టబెట్టేందుకు గత వైసిపి ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై బలమైన పోరాటాలు నిర్వహించాలని జివిఎంసి ఒకటో వార్డు తగరపువలస, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతాంగానికి సాగునీటి పిలుపునిచ్చారు. పెరిగిన విద్యుత్‌ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా ఇప్పటికే పోరాటాలు జరుగుతున్నాయని, వాటిని మరింత ఉధృతం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. పార్టీ జోన్‌కమిటీ నాయకులు కె.నాగరాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, ముద్దాడ రాము తదితరులు పాల్గొన్నారు.

భీమిలి జోన్ కమిటీ కార్యదర్శిగా మూర్తి

సిపిఎం భీమిలి జోన్ మహాసభలో కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ కార్యదర్శిగా ఆర్ఎస్ఎన్. మూర్తి, సభ్యులుగా రవ్వ నరసింగరావు, కె నాగరాణి, ఎస్ అప్పలనాయుడు, కె సత్యనారాయణ, ఎస్ గున్న, భాగం లక్ష్మి, ముద్దాడ రాము, ఒళ్ళ నాగరాజు, కె చిరంజీవిలను ఎన్నుకున్నారు. మహాసభలో పలు తీర్మానాలు ఆమోదించారు.

నేరాలు ఘోరాలు

కొబ్బరి చెట్టు పైనుంచి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎం.జగన్నాధపురం గ్రామానికి చెందిన కర్ణం నాగేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం తన పొలంలో కొబ్బరి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందన పడ్డాడు. ఈ ఘటనలో నాగేశ్వరరావు తలపై తీవ్ర గాయమై, కాలు విరిగి సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు అచ్యుతాపురం సిఐ నమ్మి గణేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీబిడ్డల అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళ తన రెండేళ్ల కుమార్తె అదృశ్యమైనట్లు ఫిర్యాదు వచ్చిందని సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలివి. మిధిలాపురి వుడాకాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బల్లంకి నాగరాజు, ఆదిలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. శనివారం భార్యాభర్తల మధ్య చిన్నపాటి వివాదం జరగ్గా, భర్త బయటకు వెళ్లిన సమయంలో రెండేళ్ల కుమార్తెను తీసుకుని ఆదిలక్ష్మి వెళ్లిపోయింది. చుట్టపక్కల బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో భర్త నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడని సిఐ తెలిపారు.

రాములోరి భూములను రక్షించాలి

- దొంగపత్రాలతో అమ్మిన వారిని శిక్షించాలని అఖిలపక్షం నిరసన

ప్రజాశక్తి -మధురవాడ : కొమ్మాదిలో సర్వే నెంబరు 84లో 31 సెంట్లు శ్రీరాముని దేవాలయం భూమిని దొంగ పత్రాలు సృష్టించి అమ్మినవారిని గుర్తించి కఠినంగా శిక్షించి, రాములోరి భూములను కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం అన్యాక్రాంతమైన భూమిలో కొమ్మాది గ్రామస్తులతో కలిసి సిపిఐ, సిపిఎంతోపాటు అఖిలపక్ష పార్టీల నేతలు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులలో శ్రీరాముని దేవాలయం భూమిగా స్పష్టంగా ఉన్నప్పటికీ, గతనెల 26న పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెంబర్లు 7762, 7764 /2004తో 750 గజాలు చొప్పున దొంగ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. మధురవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండగా పెదగంట్యాడలో చేయించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దీన్ని బట్టి ఇది దొంగపనిగానే స్పష్టమౌతోందన్నారు. సిపిఐ, సిపిఎం ఏరియా కార్యదర్శులు వి సత్యనారాయణ, డి అప్పలరాజు మాట్లాడుతూ దేవాలయ భూముల అన్యాక్రాంతంలో స్థానికుల ప్రమేయం ఉండే ఛాన్స్ ఉందని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. సిపిఐ నేతలు ఎండి బేగం, కె కుమార్, ఎంఎస్ పాత్రుడు, కె చిన్న, సిపిఎం నాయకుడు సియ్యాద్రి పైడితల్లి, కొమ్మాది గ్రామ టిడిపి నేత, న్యాయవాది గొలగాని సన్యాసిరావు, వైసిపి నేత సియ్యాద్రి కనకరాజు పాల్గొన్నారు.

'ఆంధ్రప్రదేశ్ శాసనాలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- సీతమ్మధార : సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరి సంయుక్త నిర్వహణలో ఎయు చరిత్ర, పురావస్తుశాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు సి. సోమసుందర రావు రచించిన ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రదేశ్‌లోని శాసనాలు) పుస్తకావిష్కరణ జరిగింది. క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దం నుంచి తెలుగు రాష్ట్రాల్లో ఆనాటి పాలకులు, రాజులు ఇచ్చిన శాసనాలను, అప్పటి లిపి పుట్టు పూర్వోత్తరాలు, పరిణామక్రమాన్ని పుస్తకంలో పొందుపరి చారు.సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ అధ్యక్షులు ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ అధ్యక్షతన, ఆచార్య కొల్లూరు సూర్యనారాయణ పుస్తకం పరిచయం చేశారు. మల్లంపల్లి సోమశేఖర్‌శర్మ చారిత్రిక అధ్యయన సంస్థ కార్యదర్శి శంకర్ భాగవతుల స్వాగతం పలికారను. పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డిఎస్. వర్మ చరిత్రకారులు తిమ్మారెడ్డి, రాణి శర్మ, రచయితలు బేతవోలు రామబ్రహ్మం, ద్విభాష్యం రాజేశ్వరరావు, డివి సూర్యరావు, గండికోట విశ్వనాథం, సి. సూర్యలక్ష్మి పాల్గొన్నారు

జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా

ప్రజాశక్తి-ఆనందపురం: మధురవాడ గ్లోబల్ పాఠశాలలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో గుడిలోవ విజ్ఞాన విహార్ విద్యార్థులు హితేష్, సంజయ్, వరాహ ధనంజయ సత్తాచాటారు. ఈనెల 7, 8 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, యాజమాన్యం అభినందించారు

షిప్‌యార్డ్ కాలనీలో సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 8వ వార్డు షిప్‌యార్డు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీ ఏర్పాటై 30ఏళ్లు గడుస్తున్నా నేటికీ రహదారులు డ్రైనేజీలు, ఇతర కనీస సదుపాయలు లేవన్నారు. దీంతో జనవాసాల మధ్య చెరువులను తలపించే మురుగునీటి కుంటలు, వాటి నుంచి వచ్చే దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు జివిఎంసి అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా స్పందించలేదని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- సీతమ్మధార : వైజాగ్ ఫిలిం సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారాన్ని ఆదివారం సీతమ్మధార రైతుబజారు దరి ఆక్సిజన్ టవర్స్‌లో నిర్వహించారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ అనేక మంచి సినిమాను ప్రజలకు చేరువచేయడం, సమాజాభివృద్ధికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, నరవ ప్రకాశరావు చేసిన సేవలను కొనియాడారు. సొసైటీ అధ్యక్షులు ఎ.కాశీవిశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్టార్ మేకర్ ఎల్.సత్యానంద్, కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఉపాధ్యక్షురాలు ఎ.ఉషారాణి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ బి చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్ శివకుమార్, బి గణేశ్వర బాబ్జి పాల్గొన్నారు.

నేడు రెడ్డిపల్లిలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ప్రారంభం

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభిస్తారని టిడిపి మండల అధ్యక్షులు.కోరడ రమణ తెలిపారు. మండలంలోని బాలికల విద్యాభివృద్ధికి దీన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 'గంటా'

ప్రజాశక్తి-పద్మనాభం : స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని ఎంపిడిఒ విజయకుమార్ తెలిపారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోరాటాలతో పోర్టు ఆసుపత్రిని కాపాడుకుంటాం

రిలేదీక్షల్లో పాల్గొన్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పిపిపికి ఇవ్వడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, . పెద్దఎత్తున ఉద్యమాలు చేసి కాపాడుకుంటామని సిఐటియు పోర్ట్ యూనియన్ అధ్యక్షులు జె.సత్యనారాయణ స్పష్టం చేశారు. పోర్టు ఆసుపత్రిని పిపిపికి అప్పగించి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి అభివృద్ధి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోర్టు ఆసుపత్రికి వద్ద నిర్వహిస్తున్న రిలేదీక్షలు ఆదివారం 34వ రోజుకు చేరిన సందర్భంగా మాట్లాడుతూ, కైలాసపురంలో 80 పడకలతో ఉన్న పోర్టు ఆసుపత్రిని రూ.222.43 కోట్లతో పిపిపి విధానంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలనే కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ ప్రతిపాదన విరమించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యుల వైద్యం ఖర్చు తగ్గించడానికే ఈ ప్రతిపాదన అంటూ కేంద్రమంత్రి సోనోవాల్ ప్రతిపాదన ఒట్టి బూటకమన్నారు. దీనివల్ల పోర్టు కార్మికులకు వైద్యం దూరమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిపిపి పద్ధతిలో గంగవరం పోర్టు, విశాఖ పోర్టులోని బెర్త్‌లను కార్పొరేట్లకు కట్టబెడితే ఏం జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలను విడనాడి, పోర్టు నిధులతోనే ఆసుపత్రిని అభివృద్ధి చేసి, మెరుగైన వైద్యసదుపాయాలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో సిఐటియు నాయకులు బి జగన్, బి లక్ష్మణరావు, కె.సత్యనారయణ, సిహెచ్ త్రినాథరావు, కెఎస్ కూమార్, ఈశ్వరరావు, శంకరరావు, గణేష్ రాము, నరసింహామూర్తి పాల్గొన్నారు.

'ఉపకార్ కప్' క్రికెట్ విజేతలకు బహుమతులు

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సిపి, కంచర్ల కుటుంబీకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : క్రీడలతోనే మానసిక ఆరోగ్యం లభిస్తుందని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు ఆదివారం ఆరిలోవ, హెల్త్‌సిటీ మైదానంలో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతరావు పెద్ద కుమారుడు యశ్వంత్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఉపకార్ కప్ సీజన్-2 క్రికెట్ విజేతలకు బహుమతులను అందజేశారు. ముందుగా యశ్వంత్ చిత్రపటానికి కంచర్ల అచ్యుతరావు కుటుంబ సభ్యులు పూల మాలలు వేసి ఘణంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, యువత చెడుదోవ పట్టకుండా ఇటువంటి క్రీడలను ప్రోత్సాహించడం అభినందనీయమని,కంచర్ల అచ్యుతరావు చేస్తున్న క్రీడా, సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని క్రీడలను నిర్వహిస్తామన్నారు.ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.కార్యక్రమంలో ఈస్ట్ ఎసిపి లక్ష్మణమూర్తి, సినీహీరో కంచర్ల ఉపేంద్ర, ఉపకార్ ట్రస్టు మేనేజర్ సుధీర్ కుమార్, సభ్యులు అరుణ, అనిత, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే శిక్షణ

వాగ్దేవి పాఠశాలలో కరాటే శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలో గంభీరం గ్రామపంచాయతీ వాగ్దేవి విద్యామందిర్ పాఠశాలలో ఇండియన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆదివారం ఐదుపాఠశాలలకు చెందిన 50మంది విద్యార్థులు శిక్షణకు హాజరుకాగా, శిక్షణ అనంతరం వారికి పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి గ్రేడ్‌లను నిర్ణయించి, సర్టిఫికెట్లను అందజేయనున్నారు. కొరియన్ చోటో ఖాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ రాధాకృష్ణ, ప్రెసిడెంట్ ఎం లక్ష్మీపోలారావు కోచ్‌లు చీఫ్ ఎగ్జామినర్ పి.బాలకృష్ణ, ఎ.నూకరాజు, వి. గోపీ కృష్ణ, పి.రాజు, ఆర్.శరత్‌చంద్రనాయుడు, ఎఎల్ విజయ్ పాల్గొన్నారు

శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా కృష్ణకుమార్ నియామకం

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఆత్మకూరి శంకరరావు పెద్ద కుమారుడు కృష్ణకుమార్‌ను ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా నియమించారు. శంకర్ ఫౌండేషన్ బోర్డు చైర్మన్ ఎం.రాందాస్ అధ్యక్షతన జరిగిన ట్రస్ట్ బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుండి అప్లైడ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీని చేసిన కృష్ణకుమార్ 13ఏళ్లపాటు శంకర్ ఫౌండేషన్ బోర్డులో పనిచేశారు. మేనేజింగ్ ట్రస్టీగా కృష్ణకుమార్ నియామకంపె ఆసుపత్రి డాక్టర్లు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. కృష్ణకుమార్ హయాంలో శంకర్ ఫౌండేషన్ మరింత పురోభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు. సమావేశంలో ప్రొఫెసర్ ఎ ప్రసన్నకుమార్, ఆత్మకూరి కృష్ణకుమార్, ఆత్మకూరి విజయకుమార్ వ్యక్తిగతంగాను, ఆత్మకూరి రాంకుమార్ అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

అలరించిన 'ఫ్రెండ్స్ క్లబ్' కామెడీ స్కిట్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పౌరగ్రంథాలయంలో వినోదాలు విందు కామెడీషో స్కిట్స్ ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. పెళ్ళాం ఊరెళితే, తాగుబోతు రమేష్, బ్యాంక్ మేనేజర్, ఫ్రెండ్స్ ఇంటికి వస్తే భార్య రియాక్షన్, మొదలగు స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించాయి. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకులు ఎంవి సత్యనారాయణ మాట్లాడుతూ నవ్వుతోనే మనిషి ఆరోగ్యకరంగా ఉంటారని, ఆ నవ్వును అందించడం కోసమే ప్రతినెలా మొదటి ఆదివారం వినోద్ కామెడీ షో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. హాస్యప్రియ కామెడీ క్లబ్ అధ్యక్షులు ఈమంది ఈశ్వరరావు అడవిరాజు కళాకారులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానిక ఎస్‌బిఐ ఎదురుగా ఉన్న టీ దుకాణం దెబ్బతిన్న నేపథ్యంలో దాని యజమానిరాజేంద్రప్రసాద్‌కు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి, సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సంస్థల సభ్యులు ఆదివారం రూ 17, 500 ఆర్థికసాయం చేశారు. వారికి రాజేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

చురుగ్గా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు తోట వీధిలో ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొని, పార్టీ సభ్యత్వం పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చురకల రమణ, ఎం సంజీవ్ కుమార్, ఎ గురు నాథ్ పాల్గొన్నారు

గీత కార్మికులు టిడిపి సభ్యత్వాన్ని పొందాలి

గీత కార్మికులంతా టిడిపి సభ్యత్వాన్ని పొందాలని ఆ పార్టీ బిసి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అంగటి రాము గీత కోరారు. ఆదివారం జివిఎంసి మూడోవార్డు, నేరెళ్ళవలస కాలనీలో గీత కార్మికుల సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు బి రాములప్పడు, రీసు రమణ, గండిబోయిన రమణ, కాకర ఎల్లారావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం

- మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి
- సిపిఎం గాజువాక జోన్ మహాసభలో సిహెచ్.నర్సింగరావు

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నేత సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు, కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం గాజువాక క్లబ్‌లో సిపిఎం గాజువాక జోన్ తొమ్మిదో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ, ఒకప్పుడు అడవులతో నిండిఉన్న గాజువాక ప్రాంతం స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావం తర్వాతే అన్ని విధాలుగా పురోభివృద్ధి సాధించిందన్నారు. ఎందరో ప్రాణాలు, పదవుల త్యాగంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను, ఇపుడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వరంగంలో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలన్న ప్రతిపాదనను కేంద్రం తెరపైకి తెచ్చిన తర్వాత అక్కడి ఉద్యోగులు, కార్మికులకు యాజమాన్యం పెడుతున్న ఇబ్బందులు, ఆర్థిక ప్రయోజనాల కోత వంటి వాటిని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. కార్మికుల ఉద్యమం, వ్యతిరేకత నేపథ్యంలో ప్రభుత్వరంగ సంస్థలను ఒకేసారి ప్రయివేటుపరం చేయడం సాధ్యం కాదని గుర్తించిన మోడీ ప్రభుత్వం, ముక్కలుగాచేసి కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలోనూ అదే పంథాను కొనసాగిస్తోందని, ఎట్టి పరిస్థితు ల్లోనూ విశాఖ ఉక్కు ప్రయివేటు చేతుల్లోకి వెళ్లకుండా ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. దీనికి మొదటి నుంచి సిపిఎం, అనుబంధ ప్రజా సంఘాలు అండగా ఉండి, పోరాటాన్ని ముందుకు తీసుకెళుతున్నాయని, ఇకముందు ఇలాగే కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగంలో ఉంటేనే స్టీలు తక్కువ ధరకు లభిస్తుందని, లేకుంటే రేట్లు ఆకాశాన్ని అంటడం ఖాయమన్నారు. ఐడిబిఎల్ వచ్చిన తర్వాతే మందుల ధరలు తగ్గిన విషయం గుర్తించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడీకి అనుకూలమైన ప్రభుత్వాలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న నేపథ్యంలో కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు కెఎం. శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, ఎ.నోకేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు, కె.సంతోషం, జోన్ సభ్యులు పాల్గొన్నారు.

గాజువాక జోన్ కమిటీ కార్యదర్శిగా రాంబాబు

మహాసభలో సిపిఎం గాజువాక జోన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ నూతన కార్యదర్శిగా ఎం.రాంబాబును ఎన్నుకోగా, సభ్యులుగా ఎ.నోకేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు,డి. రమణ, బి. .శ్రీనివాసరావు, జి.స్టాలిన్, ఎస్.కృష్ణమూర్తి, ఎల్.కామేశ్వరి, జి.లక్ష్మి, కె..సంతోషం, ఎం.విజయరావు, జి.అప్పారావు, ఎల్.బంగారునాయుడు 13 మందిని ఎన్నుకున్నారు.

పలువురికి సంతాపం

మహాసభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో సహా గత మహాసభ నుంచి నేటి వరకు మృతి చెందిన పలువురికి సంతాపం తెలిపారు. సీనియర్ నాయకులు ఎన్ రాజేంద్రప్రసాద్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.. ఈ మహాసభకు గొల్లపల్లి సుబ్బారావు నగర్‌గా నామకరణం చేశారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సిహెచ్.నర్సింగరావు, జి.సుబ్బారావు చిత్రపటానికి కెఎం.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు చిత్రపటానికి బి.జగన్, ఎ.సీతారామయ్య చిత్రపటానికి వై సత్యవతి పూలమాలు వేసి నివాళులర్పించారు.

మహాసభలో పలు తీర్మానాలు

గాజువాక జోన్ సిపిఎం మహాసభలో పలు తీర్మానాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపా లని,. ఆదానీ గంగవరం పోర్టు, విశాఖ డెయిరీ కాలుష్యం నివారిం చాలని, రామచంద్ర నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డ్ ఎత్తేయాలని, జనా వాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలను ఎత్తే యాలని, గాజువాక లో వంద అడుగుల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని, మహిళలపై వేధింపుల నివారణకు చర్యలు చేపట్టాలని, వంద అడుగుల రోడ్డులో వై.జంక్షన్ వరకు భారీ వాహనాల రాకపోకలను మళ్లించాలని కోరుతూ తీర్మానించారు.

స్టీల్ క్లబ్‌లో జాతీయస్థాయి అబాకస్ పోటీలు

విజేతలకు బహుమతులను అందజేస్తున్న సిజిఎం శ్రీధర్

ప్రజాశక్తి -ఉక్కునగరం : అబాకాస్ పోటీలతో విద్యార్థుల ఆలోచనలు పదునుదేరి, సృజనాత్మకత మరింత మెరుగవుతుందని ఉక్కు సిజిఎం(వర్క్స్) శ్రీధర్ అన్నారు. ఆదివారం ఉక్కునగరం స్టీల్ క్లబ్‌లో మేథ్స్ టు మెరిట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీ పరీక్షలను జ్యోతిప్రజ్వళన చేసి ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఐదేళ్లలోపు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాత పద్ధతి లేకుండా మనస్సుతో నే గణించిన విద్యార్థులను సిజిఎం శ్రీధర్ అభినందించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఈపూరి సుధారాణి మాట్లాడుతూ, 15ఏళ్లుగా క్రమం తప్పకుండా అబాకస్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. భారత్‌లోనే కాకుండా అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, కెనడా వంటి ఎన్నో దేశాలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో అబాకస్ నేర్చుకుంటున్నారన్నారు. అనంతరం ఛాంపియన్ షిప్, గోల్డ్, సిల్వర్ మెడల్స్ వచ్చిన విద్యార్థులకు ముఖ్యఅతిథి శ్రీధర్ బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఈపూరి బుచ్చిరాజు, యోగేష్ కుమార్ గార్గ్, ఆకుండి రవిశంకర్ పాల్గొన్నారు.

పసికందుకు ఎక్మోతో గుండె ఆపరేషన్

- రెండు నెలల బాబు ప్రాణాలు కాపాడిన వైజాగ్ కిమ్స్ కడల్స్ వైద్యులు

ఆపరేషన్ జరిగిన చిన్నారితో కిమ్స్ కడల్స్ వైద్యనిపుణులు

ప్రజాశక్తి- గాజువాక : రెండు నెలల వయసు, కేవలం 2.7 కిలోల బరువున్న బాబు అరుదైన గుండె వ్యాధికి ఎక్మోతో సంక్లిష్టమైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించి వైజాగ్ కిమ్స్ కడల్స్ వైద్యులు ప్రాణదానం చేశారు. ఆసుపత్రి చీఫ్ నియోనాటాలజిస్ట్, నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి, చీఫ్ ఇంటెన్సివిస్ట్, పీడియాట్రిక్ ఐసియు విభాగాధిపతి డాక్టర్ రౌతు సంతోష్ కుమార్ తెలిపిన వివరాలివి.

సాధారణంగా ఊపిరితిత్తుల్లో శుద్ధిచేసిన రక్తాన్నిరక్తనాళాల ద్వారా గుండెలోని ఎడమ కర్ణికకు వెళ్లి, అక్కడి నుంచి శరీరం మొత్తానికి సరఫరా కావాలి. కానీ, ఈ బాబుకు రక్తం కుడివైపు గుండె గదిలోకి వెళ్లి, అక్కడ శుద్ధి చేయని రక్తంతో కలిసిపోవడంతో శరీరానికి తగినంత రక్తసరఫరా జరగడం లేదు. వైద్య పరిభాషలో టోటల్ అనామలస్ పల్మనరీ వీనస్ కనెక్షన్ (టిఎపివిసి) అంటారని,. ప్రతి లక్ష మంది పిల్లల్లో కేవలం 6 నుంచి 12 మందికి మాత్రమే పుట్టుకతోనే ఈ సమస్య ఉంటుందన్నారు.

దీంతో బాలుని ప్రాణాలను కాపాడే క్రమంలో ఆక్సిజన్ స్థాయి పెంచడానికి ముందుగా సెంట్రల్ ఎక్మో పెట్టామని, . తర్వాత ఓపెన్ హార్ట్‌సర్జరీని నిర్వహించి, బాలుని ప్రాణాలను కాపాడామన్నారు. చిన్నపిల్లలకు ఎక్మో పెట్టడం చాలా సవాళ్లతో కూడుకున్నదైనా, అన్ని విభాగాల వైద్యులు పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించి, బాలుని ప్రాణాలను కాపాడడంపై ఆనందం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అసాధారణ ఆపరేషన్ చేయడం అరుదని, ఈ ఘనత సాధించడం కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యబందం అసాధారణ నైపుణ్యాలు, నిబద్ధతకు నిదర్శనమన్నారు. డాక్టర్ నిఖిల్ తెన్నేటి, డాక్టర్ ఆర్. సంతోష్‌కుమార్, డాక్టర్ రవికృష్ణ నేతత్వంలోని నియోనాటల్ వైద్యబృందంతోపాటు క్రిటికల్ కేర్, ఇతర విభాగాల బృందం అత్యున్నత సేవలందించి బాబు ప్రాణాలు కాపాడింది. డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ సాయి మణికందన్, డాక్టర్ శాంతిప్రియలతో కూడిన గుండె శస్త్రచికిత్స నిపుణుల బందం శస్త్రచికిత్స నిర్వహించిందన్నారు.

రైతు నేతలను అవమానించడం ఎమ్మెల్యేకు తగదు

విలేకర్లతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రైతు నాయకులను అవమానించడం ఎమ్మెల్యేకు తగదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పాడి రైతుల సమస్యలపై యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు వినతి పత్రం ఇవ్వటానికి ఆయన పిఎను సంప్రదించగా, ఆయన రమ్మన్న సమయానికి ఆదివారం సాయంత్రం వెళ్లామని చెప్పారు. రైతుల సమస్యల మీద వినతిపత్రం తీసుకోకుండా సమస్యను పక్కదారి పట్టించి, రైతు నాయకులను దుర్భాషలాడి బయటకు పంపించారని అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వైఖరిని తమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. విశాఖ డెయిరీ ఆవు పాలు ధర లీటరుకు రూ.3 తగ్గించడంపై ఎమ్మెల్యే వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పాల రైతులకు ఎమ్మెల్యే మద్దతు తెలిపి సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, సహాయ కార్యదర్శి ఎస్‌వి నాయుడు, నాయకులు బుద్ధ రంగారావు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర పునరుద్ధరించాలని ఎమ్మెల్యే బండారుకు వినతి

ప్రజాశక్తి-పరవాడ : విశాఖ డెయిరీ తగ్గించిన పాల ధరను పునరుద్ధరణకు చొరవ చూపాలని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తికి ఏపి రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ మేరకు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, ఉపాధ్యక్షులు ఎస్‌వి.నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీను ఆదివారం వెన్నెలపాలెంలోని ఎమ్మెల్యే నివాసంలో బండారును కలిశారు. విశాఖ డెయిరీ యాజమాన్యం లీటర్ పాలుకు మూడు రూపాయలు తగ్గించిందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. విశాఖ డెయిరీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గేదె పాలు లీటర్‌కి రూ.80, ఆవు పాలు లీటర్‌కి రూ.50 చెల్లించేలా చర్యలు చేపట్టాలని, ప్రతి నాలుగు నెలలకు బోనస్ చెల్లించాలని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

శారదా నది పరిశుభ్రతకు సహకరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

శారద నది పరిశుభ్రతకు అందరూ సహకరించాలని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన శారద నది ఘాట్ పరిశుభ్రత కార్యక్రమంలో రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్తీకమాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో శారదా నదిని పరిశుభ్రత చేయడం అభినందనీయమన్నారు. శారదా నది సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాత బ్రిడ్జిని ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, కొత్తూరు పంచాయతీ సిబ్బంది, ఫైర్ డిపార్ట్మెంట్ సిబ్బంది, కసింకోట మండలం వివేకానంద కాలేజీ, అనకాపల్లి టౌన్ సిటీ పబ్లిక్ స్కూల్, ఏఎంఏఎల్ కాలేజీ విద్యార్థులు, గ్రీన్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

నంద్యాలలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరుగు రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో రాణించాలని శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ చైర్మన్ ఆర్‌వివి.నగేష్ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. మండలంలోని నునపర్తి గ్రామంలో ఆదివారం శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా మైదానంలో శిక్షణ పొందిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఏడు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంప నరసింహానాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెదపూడి శంకర్రావు, శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాసవరపు అప్పారావు, గారపాటి అప్పలరాజు, రెడ్డి శ్రీను, ఆర్.దేముడు, డి.శ్రీను, రెడ్డి అప్పారావు, గొర్లె అప్పలరాజు, రెడ్డి ఎరుకు నాయుడు, యాసవరపు రాజేష్, గొర్లి రవి, మాసవరపు తమ్మునాయుడు, కూండ్రపు శ్రీను పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రంలో స్థానిక శ్రీగౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు దోకల లక్ష్మీ నరసింహమూర్తి మాట్లాడుతూ ఆది, సోమ, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. మంగళవారం నాగుల చవితి సందర్భంగా భారీ ఊరేగింపు, మందుగుండు సామగ్రితో గౌరీ పరమేశ్వరుల పండగ అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సూరిశెట్టి రామకృష్ణ, శరగడం సన్యాసినాయుడు, సూరిశెట్టి ఈశ్వరరావు, వేగి ఆదినారాయణ, వేగి రామారావు, సూరిశెట్టి దాసు, సూరిశెట్టి కుమార్, సూరిశెట్టి మాధవరావు, ఆడారి భీమునాయుడు, పెంటకోట దాసు పాల్గొన్నారు.

జనసేనతో చేరిన వైస్ ఎంపిపి శేషు

ప్రజాశక్తి-యలమంచిలి : మండల పరిషత్తు ఉపాధ్యక్షులు, వైసీపీ సీనియర్ నేత రాజాన శేషగిరిరావు (శేషు) జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం యలమంచిలి జనసేన కార్యాలయంలో శేషుతో పాటు ఆయన అనుచరులకు ఎమ్మెల్యే విజయకుమార్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పట్నాల దేముడు, శ్రీనివాస్, మర్రి అప్పలకొండ, పోతురాజు, దాలమ్మతో పాటు 200 మంది జనసేనలో చేరినట్టు ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు అన్నం బాబ్జీ, రాంబిల్లి మండల అధ్యక్షులు పప్పల నూకన్నదొర, లాలం సోమునాయుడు, ద్వారపురెడ్డి బాబ్జి, బొడ్డేడ భాను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న వైస్ ఎంపిపి శేషు

సముద్రంలో మునిగిపోయిన

పర్యాటకుడిని రక్షించిన మత్స్యకారులు

తాగిన నీరు బయటకు వచ్చేలా చర్యలు చేపడుతున్న దృశ్యం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పూడిమడక సముద్ర తీరం సమీపంలో సీతపాలెం బీచ్‌లో ఆదివారం ఉదయం మునిగిపోయిన పర్యాటకుడిని మత్స్యకారులు రక్షించారు. మత్స్యకారులు తెలిపిన వివరాలు ప్రకారం... సీతపాలెం బీచ్‌లో ఆదివారం ఉదయం స్నానానికి దిగిన పర్యాటకుడు మునిగిపోయాడు. దీంతో ఆ యువకుడితో వచ్చిన బంధువులు, స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మత్స్యకారులు ఎరిపల్లి కిరణ్, మరో ముగ్గురు మత్స్యకార యువకులు ఫైబర్ బోట్‌పై సముద్రంలో గాలించారు. సముద్రం నీటిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న పర్యాటకుడిని పట్టుకొని ఫైబర్ బోటుపై ఎక్కించి అప్పటికే తాగిన ఉప్పు నీటిని పైకి వచ్చేలా చర్యలు చేపట్టారు. అనంతరం తీరానికి తీసుకువచ్చి తన స్నేహితులకు అప్పగించారు. 108 అంబులెన్స్‌పై తక్షణ వైద్య సేవలకు ఆసుపత్రికి తరలించారు. సముద్రంలో గల్లంతై ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న పర్యాటకుడిని రక్షించిన కిరణ్‌ను, ముగ్గురు మత్స్యకారులను పలువురు అభినందించారు. అయితే సదరు పర్యాటకుడు, ఆయనతో వచ్చిన స్నేహితుల వివరాలు కిరణ్ తీసుకోలేదు

అభిజిత్ అక్రమ లే ఆఫ్‌పై గ్రామాల్లో ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అభిజిత్ పరిశ్రమ యాజమాన్యం విధించిన అక్రమ లే ఆఫ్‌పై సిఐటియు నాయకులు ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమం చేపట్టారు. అచ్యుతాపురం, మోసయ్యపేట, చౌడపల్లి, ఎర్రవరం, కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేట గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా పరిశ్రమను మూసివేయడం చట్టరీత్యా సరికాదన్నారు. పరిశ్రమ మూత వేయడంతో వెయ్యి మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, వారికి జీతాలు, బోనస్‌లు చెల్లించలేదని పేర్కొన్నారు. దీంతో దసరా, దీపావళి, నాగుల చవితి పండగల సందర్భంగా కార్మికులు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంపై ఒత్తిడి చేసి సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయిన కార్మికులను పరిశ్రమ యాజమాన్యం బెదిరించడం తగదన్నారు. లే ఆఫ్ ఎత్తేసే వరకు దశలవారీగా పోరాటం చేస్తామని తెలిపారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- అనకాపల్లి : పాన్ షాప్ వద్ద గొడవపడి ఒక వ్యక్తిని కొట్టి హత్య చేసిన సంఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి తెలిపారు. దీనిపై అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సావిత్రి దేవి స్టీల్ ఇండస్ట్రీలో పనిచేస్తున్న ఉత్తర ప్రదేశ్‌కి చెందిన అమిత్ కుమార్, రాంగోపాల్, వినోద్ కుమార్ గత నెల 31న జీవీఎంసీ 84వ వార్డు కొత్తూరు నరసింగ రావుపేటలో ఒక పాన్ షాప్ వద్ద కురుకురే ప్యాకెట్లు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. వారితో అక్కడ స్థానికులైన గణేష్, యశ్వంత్ గొడవ పడ్డారు. అనంతరం వారిలో వినోద్ కుమార్‌ను గణేష్, యశ్వంత్ తీవ్రంగా కొట్టడంతో ఆయన మృతి చెందాడు. అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ అశోక్ కుమార్, ఎస్సై సత్యనారాయణ ఈనెల 2న హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధపడ్డ గణేష్ యశ్వంతులను అనకాపల్లిలో అరెస్టు చేశారు. ఈ కేసులో ముద్దాయిలు పట్టుకోవడంలో శ్రమించిన సీఐ అశోక్ కుమార్, ఎస్సై సత్యనారాయణ, ఎఎస్ఐ భాస్కర్, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

సుపథ ప్రతిభా పరీక్షలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మండల స్థాయి సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 24 పాఠశాలల నుంచి 467 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులకు 8 అంశాలపై పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుపథ సంస్థ వ్యవస్థాపకులు యువిఎన్.రాజు మాట్లాడుతూ మాతృభాష, సాంస్కృతి, సాంప్రదాయ, మానవతా విలువలు పరిరక్షణ నిమిత్తం ప్రతి ఏటా విద్యార్థులకు సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కె.శ్రీనివాస్, బివి.దేవుళ్ళు, ఉదయ్ కుమార్, బి.నారాయణరావు, ఎం.రమేష్, సిహెచ్.సూర్యనారాయణ, డి.దేముడు, జి.చిన్నంనాయుడు, త్రినాథ్, నాగ కరుణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయం లాభసాటి

ప్రజాశక్తి-కె.కోటపాడు : సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవచ్చని ఎలమంచిలికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక అయ్యన్న కాలేజీలో ఆదివారం రైతుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగుమందులు, రసాయనిక ఎరువులు తగ్గించి, పశువుల వ్యర్థాలు వర్మీ కంపోస్టు తదితర సేంద్రీయ ఎరువులతో పాటు సేంద్రీయ కషాయాలను చేసుకుంటే వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవచ్చని చెప్పారు. సేంద్రియ పంటకు ఎక్కువ ధరను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు పండితులు బండారు వెంకటరమణమూర్తి, పెనగంటి నాయుడు, వర్రి వెంకట్రావు, లాలం శ్రీనివాసరావు, సమ్మెంగ అప్పారావు, రెడ్డి సూర్యనారాయణ, రెడ్డి దేముడు నాయుడు, రాపేటి వెంకటరావు పాల్గొన్నారు

మొబైల్ షాపుల యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మొబైల్ సేల్స్ అండ్ సర్వీసెస్ ఓనర్స్ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ పేర్కొన్నారు. స్థానిక రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో ఆదివారం అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణతో మాట్లాడి సమస్యలు పరిష్కారం జరిగే విధంగా చూస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న రాంకీ

నిరసన తెలుపుతున్న పాడి రైతులు

పాల సేకరణ ధర తగ్గించడంపై నిరసన

ప్రజాశక్తి-చోడవరం : విశాఖ డెయిరీ పాల కొనుగోలు ధర తగ్గించడంపై మండలంలోని లక్ష్మీపురం పాల సేకరణ కేంద్రం వద్ద ఆదివారం రైతులు ఆందోళన చేపట్టారు. వీరికి స్థానిక టిడిపి నాయకులు మద్దతు ప్రకటించారు. పశువులకు వేసే దాణా, మందులు ధరలు పెంచి పాల ధరను తగ్గించడం ఏమాత్రం సమంజసం కాదని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పాల రైతులు పాల్గొన్నారు.

4న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : విఆర్ఎ సమస్యలపై ఈ నెల 4న జరుగు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా విఆర్ఎ సంఘం కార్యదర్శి ఎన్.గంగాధరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విఆర్ఎలపై నిబంధనలకు విరుద్ధంగా అమలవుతున్న నైట్ వాచ్‌మెన్, ఇసుక డ్యూటీలను రద్దు చేయాలని, తెలంగాణలో అమలవుతున్న పే స్కేల్ జీతాలను చెల్లించాలని, ఖాళీగా ఉన్న విఆర్ఎ పోస్టులను భర్తీ చేయాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని కోరారు.

శివాలయాలు ముస్తాబు

ప్రజాశక్తి-కశింకోట : కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలను ముస్తాబు చేశారు. కశింకోట, తాళ్ళపాలెం, వెదురుపర్తి, బయ్యవరం, కన్నురుపాలెం, చింతలపాలెం, బంగారయ్యపేట, పల్లపు సోమవారం, ఎ.ఎస్.పేట తదితర గ్రామాల్లో ఆలయాలకు కమిటీ వారు విద్యుత్ అలంకరణ చేశారు. ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

భారీ వాహనాలను నియంత్రించాలి

ప్రజాశక్తి-మునగపాక : భారీ వాహనాలను నియంత్రించి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని వైసిపి జిల్లా మాజీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గంలో మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని 100 గ్రామాల ప్రజలతో పాటుగా అచ్యుతాపురం, రాంబిల్లిలో గల వివిధ కంపెనీలలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. 100 టన్నులు పైబడి అధిక లోడుతో వెళుతున్న వాహనాల వల్ల ప్రమాదాలు పెరిగాయన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన 6 నెలల వ్యవధిలోనే భారీ వాహనాల కారణంగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. మునగపాక, హరిపాలెం గ్రామాల బ్రిడ్జిలు శిథిల దశకు చేరుకోవడంతో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 35 టన్నుల మించి ఈ మార్గంలో వాహనాలు నడపరాదనిఆర్ అండ్ బి అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి భారీ వాహనాలను నిలుపుదల చేయాలని, 100 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇకెవైసికి ఇక్కట్లు

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం దీపావళి నుండి అమలు చేస్తున్న దీపం-2 పథకానికి సంబంధించి ఈకెవైసికి గ్యాస్ లబ్దిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సబ్బవరం మండలంలో ఒక్క గ్యాస్ ఏజెన్సీ కూడా లేదు. పెందుర్తి, అగనంపూడి, గాజువాక ప్రాంతాల్లో ఉన్న ఏజెన్సీల్లో మండలానికి చెందిన లబ్దిదారులు ఉన్నారు. గ్యాస్ లబ్దిదారులు ఆయా ఏజెన్సీలకు వెళ్లి ఇకెవైసి చేయించుకోవడానికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ఆయా గ్యాస్ ఏజెన్సీలు మండలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లబ్దిదారులకు అందుబాటులో ఉండి ఈకెవైసి చేయాలని లబ్దిదారులు కోరుతున్నారు. దీనిపై స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రజాప్రతినిధులు తక్షణమే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి లబ్దిదారులకు న్యాయం చేయాలని కోరుకుంటున్నారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులకు కనీస వేతనాలు కరువు

- కేజీ జీడిపప్పు వొలిస్తే రూ.20 కూలి
- సౌకర్యాలు కల్పించని యాజమాన్యం
- కార్మిక శాఖ రికార్డుల్లో నమోదు కాని వైనం

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని బెన్నవోలు గ్రామం వద్ద ఉన్న జీడి పిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యం పని చేయించుకుంటుంది. ఈ ఫ్యాక్టరీలో చోడవరం, బుచ్చయ్యపేట మండలాలకు చెందిన పదిమంది వరకు మగ, వందమంది వరకు మహిళా కార్మికులు పని చేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయడం లేదు. కేజీల పద్ధతిలో పని చేయించుకుంటున్నారు. కేజీ జీడిపప్పుడు వలిస్తే రూ.20 చొప్పున రోజువారీ రూ.300కు మించకుండా కూలి ఇస్తున్నారు.

ఫ్యాక్టరీలో యంత్రాలు, బాయిలింగ్ ఉండే చోట మహిళలు జీడి పిక్కలు వలిచే పని చేస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం కార్మికులను వెంటాడుతుంది. ఇక్కడ పని చేస్తున్న మహిళలకు గ్లౌజులు, మాస్కులు ఇవ్వడం లేదు. చాలామందికి గ్లౌజులు, మాస్కులు లేకుండానే పని చేస్తున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో మహిళల అవసరాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు గాని, మంచినీటి సదుపాయం గాని లేదు. దీంతో పక్కనే ఉన్న సరుగుడి తోటలోకి వెళ్లి వారి అవసరాలు తీర్చుకునే దుస్థితి నెలకొంది.

తక్కువ ప్రాంగణంలో ఎక్కువ మంది పని చేయించడం వల్ల జీడి పిక్కల ద్వారా వెలువడే వాయువు, ఆయిల్ వంటి వాటి వల్ల ఆరోగ్యానికి హానికరం చేస్తున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి సదుపాయాలు కల్పించకపోగా కనీసం వారి అక్కడ పని చేస్తున్నట్లు రికార్డుల్లో కూడా నమోదు కాలేదు. సుమారుగా 120 మంది పనిచేస్తున్న చోట ఇటీవల 20 మందికి పేర్లు మాత్రమే కార్మిక శాఖ రికార్డుల్లో నమోదైనట్లు తెలుస్తుంది. కేరళ రాష్ట్రానికి చెందిన ఫ్యాక్టరీ యజమానులు ఇక్కడ దళారీలను ఏర్పాటు చేసుకొని పరిశ్రమలను నడుపుతున్నారు. కేరళ రాష్ట్రంలో ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులకు కనీస అవసరాలతో పాటు కార్మికులకు వర్తించే అన్ని సదుపాయాలు సమకూర్చవలసి ఉంది. అదే ఏపీలో అయితే కారుచౌకగా కార్మికులు దొరుకుతున్న నేపథ్యంలో ఇక్కడ ఫ్యాక్టరీలు నెలకొల్పి శ్రమ దోపిడీ చేస్తున్నారు. పనిచేసే చోట ఎటువంటి ప్రమాదం సంభవించినా కార్మికులకు ఎటువంటి భరోసా లేదనే చెప్పవచ్చు. కార్మికశాఖ అధికారులు పర్యవేక్షణ లోపం, అడిగేవారు లేకపోవడంతో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. ఎవరైనా వ్యతిరేకిస్తే పని దొరకదన్న భయం కార్మికుల్లో ఉంది. దీంతో ఫ్యాక్టరీ నిర్వహణ మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

గ్లౌజులు, మాస్కులు లేకుండా పనిచేస్తున్న మహిళా కార్మికులు

మెట్రో కెమ్ ప్రమాదంపై విచారణ చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకరరావు, కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

పరవాడ ఫార్మాసిటీలోని మెట్రో కెమ్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని, భద్రతా చర్యలపై ప్రభుత్వం , అధికారులు చొరవ తీసుకోవాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి కోటేశ్వరావులు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం రాత్రి మెట్రోకెమ్ కంపెనీలో రియాక్టర్ వద్ద సంభవించిన పేలుడు వల్ల కంపెనీలో కార్మికులు, చుట్టూ ఉన్న ప్రజలు భయాందోళన గురయ్యారని, ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన ఎసెన్షియ, సినర్జన్ కంపెనీలలో భారీ ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలు పట్ల ఇంకా ప్రభుత్వాలు, యాజమాన్యాలు గుణపాఠాలు తీసుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి పర్యటించిన కొన్ని గంటల్లోనే ప్రమాదాలు జరిగాయని, ప్రభుత్వాలు యాజమాన్యాల తరపున తప్ప కార్మికుల ప్రాణాలు పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ ప్రమాదంలో భద్రత ప్రమాణాల డొల్లతనం మరోసారి బయటపడిందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే కంపెనీలో భద్రత ఆడిట్ నిర్వహించి ప్రమాణాలపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

కాల పరిమితి సర్క్యులర్ రద్దుకు దశలవారీ పోరాటం

ఏపీ వెలుగు విఓఎల సంఘం జిల్లా నేతలు శ్రీనివాసరావు, రూపాదేవి

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

వెలుగు వివోఏలుగా పనిచేస్తున్న యానిమేటర్లను ప్రతి మూడు సంవత్సరాలకు మార్చాలనే కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేసే వరకు దశలవారీ పోరాటాలు చేస్తామని ఏపీ వెలుగు వివోఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సిహెచ్ రూపాదేవి పేర్కొన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హయాంలో తమ సంఘం పోరాటాల ఫలితంగా ఆ సర్క్యులర్‌ను నిలుపుదల చేసుకోగలిగామని తెలిపారు. నేడు మరలా టిడిపి కూటమి ప్రభుత్వం ఈ సర్క్యులర్‌ను తెరపైకి తేవడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఆదిలోనే విఓఏలపై కత్తి కట్టిందన్నారు. ఐదు నెలలకు ఒకసారి ఒక నెల జీతాన్ని మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు అమలు కావడం లేదన్నారు. ఐదు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని, కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని కోరుతూ ఈనెల 7న అన్ని మండలాల్లో నిరసన ప్రదర్శనలు, అధికారులకు వినతి పత్రాలు కార్యక్రమం చేస్తామని తెలిపారు. 11, 12 తేదీల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇస్తామని, అసెంబ్లీ సమావేశాలు నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళనలకు పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రాజేష్, రాము, వై.లక్ష్మి, కె.లక్ష్మీప్రసన్న తదితరులు మాట్లాడారు.

కెజిబివిలో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాడు-నేడు నిధులతో చేపట్టిన భవనం అసంపూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. బాత్‌రూమ్‌లు కొరత, చాలీచాలని గదులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 259 విద్యార్థునులు ఉన్న ఈ పాఠశాలలో సైన్స్, తెలుగు ఉపాధ్యాయులు లేరని పేర్కొన్నారు. సోలార్ ప్లేట్లు ఉన్నా పని చేయడం లేదన్నారు. తక్షణమే పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వం ప్రతినెలా ఒకటవ తేదీనే జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ఉద్యోగుల పరిస్థితి మార్పు రాలేదన్నారు. సమయానికి జీతాలు రాకపోవడంతో ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, ఈఎంఐ కట్టలేక పైన రూపంలో కోట్ల రూపాయలు ఉద్యోగులు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి కట్టకపోవడంతో సిబిల్ స్కోర్ పడిపోయి తిరిగి అప్పు కూడా పుట్టలేదన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగుల పడిన తిప్పలే నేటి ప్రభుత్వంలో కూడా పడుతున్నామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పిఆర్‌సి డిఎ బకాయిలతో రూ.25 వేల కోట్లు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సూర్యకుమారి, చిన్నారావు, కృష్ణమోహన్, రామాంజనేయులు, కిషోర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని చిప్పాడ పునరావాస కాలనీలో రామాలయం నిర్మాణానికి ఆదివారం ఉదయం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజాన నాయుడు బాబు, ఎంపిటిసి సభ్యుడు రాజాన బాషా, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, జనసేన మండల అధ్యక్షుడు బి రాందాస్ చిప్పాడ మాజీ సర్పంచ్ రెడ్డి శ్రీనివాసరావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు రాజాన రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నల్లరేగులపాలెం, నారపాడు, తవ్వవానిపాలెం పంచాయతీలలో చేపట్టిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గండి బాబ్జి పాల్గొని మాట్లాడారు. రూ.100తో సభ్యత్వం చేసుకున్న వ్యక్తికి ఐదు లక్షలు ఇన్సూరెన్స్, వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పనకు అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, నాయకులు గండి వంశీ, కె.రామ కృష్ణంరాజు, గండి దేముడు, బర్నికాన సాయినాథరావు, రొంగలి శ్రీనివాసరావు, కోరుపోలు గోవింద, పైల వెంకట రమణ, దాడి కన్నం నాయుడు, బోకం అర్జునుడు, బోకం బాలకృష్ణ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన 70 ఏళ్ల కన్నబాబు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలం కాశీపురం గ్రామానికి చెందిన 70 ఏళ్ల ఆదిరెడ్డి చినకన్నబాబు మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. ఆదివారం జరిగిన విశాఖ జిల్లాస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ 70 సంవత్సరాల విభాగంలో 100 మీటర్లు, షాట్ పుట్, ఐదు కిలోమీటర్ల వాకింగ్ విభాగాలలో ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఏడుపదుల వయసులోను క్రీడల్లో రాణిస్తున్న కన్నబాబును మండలంలోని పలువురు పెద్దలు అభినందించారు.

అనితమ్మా..అడ్డురోడ్డువైపు చూడమ్మా...

-రహదారి గుంతలతో వాహనదారుల అవస్థలు -ఎన్నికల్లో హామీ మేరకు మరమ్మతు చేపట్టాలని వేడుకోలు

ప్రజాశక్తి- కోటవురట్ల: హోం మంత్రి అనితమ్మా గుంతలతో ఉన్న అడ్డురోడ్డును పట్టించుకోవమ్మా అంటూ నర్సీపట్నం, అడ్డురోడ్డు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు వేడుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తోంది. అయినా ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రతిపక్ష నాయకులు మాత్రమే కాదు అధికార పార్టీ నాయకులు తీవ్రమైన విమర్శలు గుప్పిస్తున్నారు. ఎమ్మెల్యే అయిన వెంటనే నియోజకవర్గంలో చేసే మొదటి పని అడ్డురోడ్డు రహదారి మరమ్మతు చేపట్టి బాగు చేస్తానని ఎన్నికలలో మంత్రి అనిత హామీ సైతం ఇచ్చారు. అనుకున్నట్లే అధికారం వచ్చింది. ఎమ్మెల్యే మాత్రమేకాదు మంత్రి కూడా అయ్యారు. అయినా కనీసం రోడ్డు గురించి ఎక్కడ ప్రస్తావించిన దాఖలాలు లేవంటూ ప్రజలు తీవ్రమైన విమర్శలు గుప్పిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో విద్యార్థులు, ప్రయాణికులు నర్సీపట్నం డివిజన్ కేంద్రానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయం కావడంతో పలు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. దుమ్ము, ధూళితో తీవ్ర అవస్థలు పడుతున్నారు హేటిరో, బ్రాండిక్స్, హేచరీ కంపెనీ, డక్కన్ కంపెనీకి వెళ్లే వాహనాలు రాత్రనక పగలనక తిరుగుతూనే ఉంటాయి. ఆయా బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అడ్డురోడ్డు మార్గంలో భారీ గొయ్యిలో వెళుతున్న వాహనం

అదే విధంగా కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రైల్వే స్టేషన్ కు వెళ్లే ప్రజలు, ఆటోలో ప్రయాణించే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, ఇలా అన్ని వర్గాల ప్రజలు రహదారి సక్రమంగా లేక పోవడంతో ప్రయాణం నరకప్రాయం అవుతుంది. అంతేకాదు ఇందేశవాక వద్ద రహదారికోతకు గురైంది. ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల గుంతల రహిత రహదారులకు కేటాయించిన నిధుల్లో అడ్డురోడ్డు వెళ్లే రహదారికి కేటాయిస్తారని అంతా ఎదురు చూశారు. గురువారం రాష్ట్ర మంత్రి అనిత నియోజకవర్గంలో పలు రహదారులకు శంకుస్థాపనలు చేశారు. ఈ రహదారికి నిధులు కేటాయించక పోవడం పట్ల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

బిఎన్ రోడ్డులో.. గుంతల పూడ్చివేతకు కలగని మోక్షం

ప్రజాశక్తి -కొత్తకోట: భీమునిపట్నం -నర్సీపట్నం (బి ఎన్) రహదారిలో గుంతలు పూడ్చివేతకు మోక్షం కలగలేదు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లుగా మార్చాలని ఇటీవల ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో 38 వ రహదారి గా పేరొందిన ఈ రహదారి పై గత ఏడు ఏళ్ళు గా పాలకుల నిర్లక్ష్యం కొన సాగుతూనే ఉంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రధాన రహ దారులను గుంతల రహితంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించినట్టు పలు వార్తా కథనాలు వస్తున్నాయి. ఈ పథకాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు విజనగరం జిల్లా గజపతినగరం మండలంలో ప్రారంభించిన విషయం కూడా తెలిసిందే. ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.860 కోట్లు ఖర్చుకు నిధులు కేటాయించింది. ఈ వార్తను వివిధ వార్త పత్రికల ద్వారా తెలుసుకున్న చోడవరం నియోజకవర్గంలో బుచ్చయ్య పేట, రావికమతం, రోలుగుంట మండలాల ప్రజల తమ రహదారి కష్టాలు తీరబోతున్నాయని ఆశపడ్డారు. ఈ కార్యక్రమంలో భాగంగా చోడవరం నుంచి నర్సీపట్నం వరకు ఉన్న బిఎన్ రహదారిలో గుంతలు పూడ్చేందుకు నిధులు కేటాయిస్తారని ఎదురు చూశారు. కానీ నిధులు కేటాయింపు జరగ లేదు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారి అభివృద్ధికి న్యూ డెవలప్మెంట్ బ్యాంక్ (ఎన్ డి బి) సుమారు రూ.110కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ ఈ పనులు పూర్తి చేయకుండా మధ్యలో వదిలి వెళ్లి పోయారు. ఈ కారణంగా రహదారి పొడ గున భారీ గోతులతో నిండిపోయింది. దీంతో పలుమార్లు ఈ రహదారిలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గుంతల రహిత రహదారి పథకంలో ప్రస్తుతం ఎన్ డి బి పథకంలో పనులు జరుగుతున్న రహదారుల మరమత్తులకు నిధులు కేటాయించలేదు. ఈ కారణంగా చోడవరం

బిఎన్ రోడ్డులో గొయ్యి పడిన రహదారి

నుంచి నర్సీపట్నం రహదారి లో కనీసం మరమ్మతులు చేయడానికి కూడా ఆస్కారం లేకుండా పోయింది. ఈ విషయమై ఆర్ అండ్ బి జేఈ సాయి శ్రీనివాస్ ను వివరణ కోరగా ఎన్ డి బి నిధులతో ప్రోగ్రెస్ లో ఉన్న రహదారులకు నిధులు కేటాయించలేదని తెలిపారు.

నరికిన చెట్లు

తీరప్రాంతంలో సరుగుడు తోట నరికివేత

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: తీర ప్రాంత గ్రామమైన బంగారమ్మపాలెం దరి కాపుల వాతాడ తీరంలో సరుగుడు తోట నరికివేతపై గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన మల్లి రమణ, మైలపల్లి శ్రీను, కాపులవాతాడ గ్రామస్థులు ఇచ్చిన వివరాల ప్రకారం... కాపులవాతాడ గ్రామం తీర ప్రాంతంలో అటవీ శాఖకు చెందిన భూముల్లోని సరుగుడు తోటను బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా నరికించి అమ్ముకం పెట్టారన్నారు. సుమారు నాలుగు లక్షల విలువ చేసే కలపను వీరు తరలించేందుకు సిద్ధపడుతుండటంతో గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు.

ఈ విషయమై యలమంచిలి అటవీ శాఖాధికారి అనిల్ కుమార్‌ను వివరణ కోరగా.. చెట్లను నరికిన వారు అవి తమ భూములకు సంబంధించినవని, వాటి పత్రాలు చూపిస్తామన్నారన్నారు. సోమవారం వాటిని పరిశీలించి, అటవీ భూముల్లో చెట్లను నరికితే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

పుత్తడిగైరంపేటలో పల్లకి సేవ

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో ఆదివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పల్లకి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వెంకట్రామపురం ఆశ్రమం నుంచి పల్లకిని చుట్టు పక్కల గ్రామాల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పత్తి రమణ, అయ్యప్ప స్వామి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: తన ఇంటిలో సైకిల్ దొంగతనం పై ఫిర్యాదు చేసినట్టు జై భీమ్ రావ్ భారత్ పార్టీ అనకాపల్లి జిల్లా ప్రెసిడెంట్ నేతల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మున్సిపాలిటీ కృష్ణ బజార్ ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా శ్రీ సంపత్ వినాయక క్లినికల్ లేబరేటరీ మేడ పైన నివాసముంటున్నామని తెలిపారు. అక్టోబరు 30న రాత్రి తమ ఇంటి వద్ద ఉంచిన సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

దత్తాశ్రమంలో విగ్రహం ప్రతిష్ట

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: బలిఘట్టం దత్తాశ్రమంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాన్ని స్పీకర్ అయ్యన్న సతీమణి చింతకాయల పద్మావతి ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆమె పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త నిర్వాహకులు ప్రసాదరావు మాట్లా డుతూ, ఉత్తరాం ధ్రలో ఉత్తరవా హిని పుణ్య నది తీరం అత్యంత ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందినట్లు పేర్కొన్నారు. ప్రతి మంగళవారం సుబ్రహ్మణ్య స్వామికి విశిష్ట పూజలు జరగనున్నట్లు ఆయన వెల్లడించారు.

పూజలు చేస్తున్న పద్మావతి

ఘనంగా గ్యార్మీ షరీఫ్ పండగ

ప్రజాశక్తి -రోలుగుంట: ముస్లిలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే గ్యార్మీ షరీఫ్ పండుగను ఆదివారం రోలుగుంట మండలం నిండుగొండ గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడ ప్రత్యేక ఇమాములచే ప్రత్యేక బయాన్ ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో పాటు సోదరీమణులు కూడా అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం వచ్చిన వారందరికి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అల్లూరి జిల్లాకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-పాడేరు: పింఛన్ల పంపిణీలో అల్లూరి సీతారామరాజు జిల్లా మరోసారి ప్రథమ స్థానం సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలలతో పాటు అక్టోబర్ నెలలో కూడా పింఛన్ల పంపిణీలో మొదటి స్థానం సాధించి హ్యాట్రిక్ సాధించడం పట్ల సంబంధిత అధికారులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో 1,24,354 మంది లబ్ధిదారులకు రూ. 51,79,56,000లు పింఛన్లు విడుదల కాగా 1,23,706 మందికి రూ. 51,52,75,500లు పంపిణీ చేసి 99.48 శాతం పంపిణీతో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీని నిరంతరం పర్యవేక్షించిన డిఆర్డిఏ పిడి వి.మురళిని కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు డివిజన్లోని 11 మండలాలకు చెందిన ఏఎన్ఎంలు పాడేరు గిరిజన భవన్లో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో దసలవారీగా నిరసన కార్యక్రమాలు తెలియజేస్తామని వారు తెలియజేశారు. గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్నామనీ అనేక సమస్యలతో బాధపడుతున్నామన్నారు. ఈ విషయమై పలుమార్లు డీఎం అండ్ హెచ్ ఓ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, సమస్య నేటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ నెలలో రెండవ ఏ ఎన్ ఎం లకు 22000 జీతం రావాల్సి ఉండగా కేవలం 600 రూపాయలు అకౌంట్ లో పడిందని, దీంతో నెలంతా ఎలా బతకాలో అర్థం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేషియల్ హాజరు నుండి ఫీల్డ్ సిబ్బందికి మినహాయింపు నివ్వాలన్నారు. యప్స్, ఆన్లైన్ వర్కులతో పని భారం ఎక్కువైందని తెలిపారు.అధికారుల తీరుకు నిరసనగా ఈ నెల 15న పాడేరులో నిరసన తెలియజేయ జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంల సంఘం నాయకులు పుష్ప, ముక్తమ్మ, కుమారి, భవాని, అంబిక, పార్వతి, వరలక్ష్మి, శెట్టి నాగరాజు 11 మండలాల ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

రైతు నాయకులను

ఎలమంచిలి ఎమ్మెల్యే దుర్భాషలాడటం సరికాదు

ప్రజాశక్తి -నక్కపల్లి: పాల రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు రైతు సంఘం నాయకులు వెళ్లగా, వినతిపత్రం తీసుకోకుండా దుర్భషలు ఆడటం సరికాదని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అధ్యక్షులు కర్రి అప్పారావు, జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సహాయ కార్యదర్శి ఎస్‌వి నాయుడు, రైతు నాయకులు బుద్ధ రంగారావు వెళ్లి పాడి రైతుల విషయంలో విశాఖ డైరీ ఆవు పాలు కు మూడు రూపాయలు ధర తగ్గించడం విషయంపై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా ఎమ్మెల్యే నాయకుల పై దుర్భసలడటంపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పాడేరు: బక్కులపనుకు శ్మశానం రోడ్డు పనులను సర్పంచ్ ఉషారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, వార్డ్ మెంబర్ గోపాలకృష్ణగారు(అబ్బాస్), వార్డ్ మెంబర్ వర్దన వరలక్ష్మి, మాజీ సర్పంచ్ పిన్నై దొర, కార్ యూనియన్ ప్రెసిడెంట్ నాయుడు, కాంట్రాక్టర్ సూకరాజు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై టార్పాలిన్ వేయకుండా వెళుతున్న దృశ్యం

ఇష్టారాజ్యం..

-క్వారీ వాహనాల నుంచి ధుమ్ముధూళి

-అవస్థలు పడుతున్న ప్రజలు -పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో గొట్టువాడ గ్రామం వద్ద నుంచి నిబంధనలను అతిక్రమించి నల్ల పిక్క క్వారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. పరిమితికి మించి క్వారీ రబ్బిష్, భారీ వాహనాలతో నల్లపిక్క లారీలు విచ్చలవిడిగా మితిమీరిన వేగంతో ప్రధాన రహదారి పైనుంచి వెళుతున్నాయి. ఈ వాహనాల నుంచి వచ్చే దూళి దుమ్ముతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. క్వారీ రబ్బిష్ వెళ్తున్న సమయంలో ట్రాక్టర్ లేదా లారీపై నీళ్లు చల్లి, టార్పాలియన్ కట్టి వాహనాలు రోడ్డుపై నడపాల్సి ఉంది. ఆ దిశగా క్వారీ యజమానులు చేపట్టిన దాఖలు లేవు. దీనిపై అధికారులు పట్టించుకోలేదు. శిథిలావస్థకు చేరిన వంతెనలపై నుండి 40 నుండి 50 టన్నుల వరకు రాత్రి, పగలు అని తేడా లేకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాల కారణంగా రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయి. మితిమీరిన వేగం, పరిమితికి మించిన లోడుతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి భారీ వాహనాలను నియంత్రించి నిబంధనల మేరకు వాహనాలు తిరిగే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-గొలుగొండ: అచ్యుతాపురం మండలం హరిపాలెంలో జరిగిన జిల్లా స్థాయి అండర్ 14 త్రోబాల్ పోటీలో గొలుగొండ మండలం చోద్యం ఉన్నత పాఠశాల విద్యార్థిని గీతిక గెలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీఈటి నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు, చైర్మన్ పోతల సత్తిబాబు, సిహెచ్.రమణ, వరప్రసాద్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

నేడు గిరిజన శాఖ మంత్రి పర్యటన

ప్రజాశక్తి-పాడేరు - రాష్ట్ర గిరిజన సంక్షేమ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈనెల 4న అల్లూరి జిల్లాలో పర్యటించనున్నారు. ముందుగా బంగారమట్ట గ్రామంలో దీపం 2 కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. సుంద్రుపుట్టులో మిషన్ పాట్ హొల్ ఫ్రీ కార్యక్రమంలో పాల్గొంటారు. కుమ్మరిపుట్టు గిరిజన సంక్షేమ పాఠశాలలో కిషోరి వికాశం కార్యక్రమంలో పాల్గొంటారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా...

నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు తగదు

మాట్లాడుతున్న నిర్వాసితుల పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి: వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్ ఎలా ఏర్పాటు చేస్తారని నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు ప్రశ్నించారు. మండలంలోని చందనాడ గ్రామంలో ఆదివారం కారిడార్ నిర్వాసితులు పోరాట కమిటీ సమావేశం జరిగింది. నిర్వాసితుల సమస్యల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట సేకరించిన భూముల్లో ఆర్సెలాల్ మిట్టల్, విప్పన్ స్టీల్స్ సంయుక్తంగా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించాలని, నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం చేయకుండా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పరిశ్రమలు, అభివృద్ధి ఎంత ముఖ్యమో ఆ పరిశ్రమలు ఏర్పాటుకు భూములు ఇచ్చి, తమ జీవితాలు త్యాగం చేస్తున్న నిర్వాసితులను ఆదుకోవడం కూడా అంతే ముఖ్యమని ముఖ్యమంత్రి కి తెలియదా అని ప్రశ్నించారు. ఇల్లులు కోల్పోతున్న టువంటి వారికి నేటికీ ఎక్కడ పునరావాసం కల్పిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయలేదని, ఏ సంవత్సరానికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తారో, ఎంత చెల్లిస్తారో నేటికీ తెలపలేదని, అంతేకాకుండా అనేకమంది పేద సాగుదారులు సాగు చేసుకుంటున్న భూములకు పరిహారం చెల్లించలేదన్నారు. చట్ట ప్రకారం చెట్లకు, నిర్మాణాలకు, బోరు బావులకు చెల్లించాల్సిన పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించలేదన్నారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. పరిశ్రమల వ్యర్ధ, రసాయన జలాలు సముద్రంలో కలవడంతో చేపలు మృత్యువాత పడతాయని, దీంతో వృత్తి కోల్పోతున్న మత్స్యకారులను, ఉపాధి కోల్పోతున్న రైతులు, కూలీలు, వివిధ వత్తిదారులను ఏ విధంగా ఆదుకుంటారో తెలియచేయకుండా పరిశ్రమలు ఏర్పాటుకు సన్నాహాలు చేయడం నిర్వాసితులను మోసగించడమే అవుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నాయకులు ఎం.సత్యనారాయణ, టి.అప్పలస్వామి, గోవిందరావు, ఎస్.చిన్న, ఆర్.అప్పారావు, యు రమేష్, పి.చిన్నతాత, టి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

54 ఏళ్లుగా లే-అవుట్ పర్మిషన్‌కు ఆటంకాలు

-మా సొసైటీ స్థలంలో మేం పనులు చేపట్టాం

-ఎర్రమట్టి దిబ్బల ధ్వంసం జరగలేదు

-జిఎస్ఐ సర్వే చేశాక కూడా బురదజల్లడం న్యాయమా?

-ఆ కార్పొరేటర్ అసత్య ప్రచారం ఆపాలి

-భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ప్రతినిధులు

మాట్లాడుతున్న సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రభుత్వం దగ్గర 54ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూముల్లోనే చదును చేసుకుంటుండగా తమకు అనేక రూపాల్లో ఆటంకాలు ఎదురవుతున్నాయని ప్రభుత్వంలోని పెద్దలు జోక్యం చేసుకుని సీనియర్ సిటిజన్లమైన తమకు న్యాయం జరిగేలా లే-అవుట్‌లో పనుల నిర్వహణకు అనుమతులు కల్పించాలని భీమునిపట్నం మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ (కోట అప్పలనర్సయ్య రిటైర్డ్ జిల్లా జడ్జిచే 29.05.1970లో స్థాపించబడిన) సొసైటీ అధ్యక్షులు జి.హరిగోపాలరావు, కార్యదర్శి పి.సూరిబాబు, ఉపాధ్యక్షులు వి.నారాయణరావు ఆవేదన చెందారు. విశాఖలోని ఓ హోటల్‌లో ఆదివారం ఉదయం వారు సంయుక్తంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అధ్యక్షులు హరిగోపాలరావు మాట్లాడుతూ 1970లో ఏర్పాటైన తమ హౌసింగ్ సొసైటీ కాలంలో భీమునిపట్నం చుట్టుపక్కలా ఎలాంటి కట్టడాలూ లేవని అప్పట్లో 400 ఎకరాలను ప్రభుత్వం వద్ద సర్వే నెంబర్ 118 (పాత సర్వే నెంబర్ 49/1)లో తాము కోరామని తెలిపారు. పైన తెలిపిన సర్వే నెంబరులో 373.95 ఎకరాలు 1983లో అప్పటి మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వం వద్ద కొనుగోలు చేశామని వివరించారు. అక్కడ ఐఎన్ఎస్ కళింగకు తూర్పు దిశగా ఉండే పై స్థలాన్ని ప్రభుత్వం తమకు కేటాయించిందని చెప్పారు ఆ తర్వాత సొసైటీకి ప్రభుత్వానికి మధ్య పలు న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు కొనసాగాయని వివరించారు. అలా 2005లో సొసైటీ ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా 2009లో కోర్టు ఆదేశానుసారం 1996 నాటి మార్కెట్ విలువ ప్రకారం పైన తెలిపిన భూమిని గుర్తించి సొసైటీకి జిఒ ఎంఎస్ నెంబర్ 504 ద్వారా 2013 సెప్టెంబర్ 20వ తేదీన భీమిలి తహశీల్దార్ ద్వారా తమకు దఖలు పడిందని వివరించారు.

జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేసి ఇచ్చిన భూమి...

ఎవరో ఒకరు ఏదో ఒక విధంగా ఫిర్యాదు చేస్తున్న కారణంగా జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 2014 నుంచి 2015 ఏడాది కాలం పాటు ఏరియా అంతటినీ సర్వే చేసి తమకు గతంలో కేటాయించిన 373.95 ఎకరాల స్థలంలో 91.50 ఎకరాలు (సర్వే నెంబర్ 118/1,3,4) విడిచిపెట్టి మిగిలిన 242.47 ఎకరాల భూమిలో లే-అవుట్ ప్లాన్ అనుమతులు ఇచ్చిందని హరిగోపాలరావు తెలిపారు. జివిఎంసి అధికారులు 2023లో టిఎల్‌పి (టెంటెటివ్ లే అవుట్ ప్లాన్) ప్రొసీడింగులను ఇచ్చారని అందుకు గానూ రూ.5.64లక్షల మేరకు లే-అవుట్ ఫీజును కూడా చెల్లించామని తెలిపారు. టిఎల్‌పి ప్రొసీడింగ్స్ వచ్చినందున 242.47 ఎకరాల్లో మట్టి కిందకు పోకుండా పనులు చేస్తున్న క్రమంలో విశాఖ నగరానికి చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కోర్టులో పిల్ వేశారని, ఇది చాలా అన్యాయమని ప్రతినిధులు పేర్కొన్నారు. తాము చదును చేసే ప్రదేశం పూర్తిగా జిఎస్ఐ సర్వే జరిగాక అన్ని అనుమతులూ లభించాక చేసినా ఎర్రమట్టి దిబ్బలు (జియో హెరిటేజ్) సైట్ అంటూ హల్‌చల్ చేయడం దారుణమైన విషయమని, 54ఏళ్లుగా ఈ స్థలాల కోసం ఎదురుచూస్తూ కళ్లు కాయలు కాసి సీనియర్ సిటిజన్‌లుగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతూ తెలిపారు. కార్యదర్శి సూరిబాబు మాట్లాడుతూ, జియో హెరిటేజీ సైట్‌ను మార్క్ చేసి జిఎస్ఐ ఇచ్చాక వాటిలోకి తాము వెళ్లడం లేదని, తమ భూమే 90 ఎకరాలు నష్టపోయినా పరిహారం కూడా లభించలేదని ఆవేదన చెందారు. ఎర్రమట్టి దిబ్బల స్థలం అని సూచించిన 91 ఎకరాలను మినహాయించి పనులు చేస్తున్నా మూర్తియాదవ్ తమ సొసైటీపై బురదజల్లి దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. అలాగే సిఆర్‌జెడ్ నిబంధనల నిర్ణయాన్ని కూడా ప్రభుత్వం ఇంతవరకూ చేయలేదన్నారు. 1996 సుప్రీం కోర్టు ద్వారా సొసైటీ ఈ భూములు కొనుగోలు చేసిందని, నేవీ వాళ్లు ఏమైనా అభ్యంతరాలు చేసినా వాటిని సైతం క్లియర్ చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. తమ సొసైటీ ఏ తప్పు చేయలేదని బాధితులుగా తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టిసారించి తమ 2000 కుటుంబాల చిరకాలపు కోరికపై స్పందించి అన్ని అనుమతులూ ఇప్పించాలని కోరుతున్నామన్నారు.

ఆపద్బాంధవుల ఆకలి కేకలు

-104, 108 ఉద్యోగులకు నాలుగు నెలలుగా అందని జీతాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆపద్బాంధవులుగా పిలవబడే 104, 108 ఉద్యోగులు నాలుగు నెలలుగా జీతాలు అందక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. గత వైసిపి ప్రభుత్వంతో పాటు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా తమ కడుపుమాడ్చడం న్యాయమా అని సిబ్బంది వాపోతున్నారు. అత్యవసర పరిస్థితులలో కుయ్... కుయ్ అని వచ్చే 108 వాహనాల సిబ్బంది మాత్రం నెలల తరబడి జీతాలు అందక కుయ్యో మొర్రో అంటున్నారు. విశాఖ జిల్లాలో మొత్తం 16 వాహనాలు ఆపదలో ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. పైలెట్లు, ఈఎంటీలు కలిపి సుమారు 78 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ 4 నెలలుగా జీతాలు అందటం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారు. గతంలో లక్ష మందికి ఒక వాహనం ఉండగా, ఇప్పుడు 70 వేల మందికి 108 వాహనం ఉంది. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు, రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నప్పుడు, రోగులను, క్షతగాత్రులను తరలిస్తున్న 108 సిబ్బందికి రోగుల దీవెనలు అందుతున్నాయి కాని ప్రభుత్వం మాత్రం జీతాలు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెడుతోంది. ఎక్కువమంది క్షతగాత్రులను కెజిహెచ్‌కు తరలిస్తున్నారు. గుండె జబ్బులు, ఇతర అత్యవసర ఆరోగ్య పరిస్థితి సమయంలో, రోగులను వారు కోరుకునే ఆసుపత్రికి తరలిస్తున్నారు. ప్రధానమైన భూమిక నిర్వహిస్తున్న సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం మవుతున్నాయి.

ఇక 104 వాహన సిబ్బంది బాధలు ప్రత్యేకంగా చెప్పేది లేదు. ఒక్కొక్క వాహనంలో ఒక డ్రైవర్‌తో పాటు, రోగులకు సేవలందిచడానికి ఒక ఈఎంటీ అందుబాటులో ఉంటారు. రెండు షిఫ్ట్‌లలో సిబ్బంది పని చేస్తున్నారు. అంటే ఒక్క వాహనానికి ముగ్గురు సిబ్బంది పనిచేస్తారు. గత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈఎంటీలకు ప్రతి ఏటా ఇంక్రిమెంట్లు ఇస్తామని చెప్పారు. కానీ ఐదేళ్లలలో ఎప్పుడూ చెల్లించలేదు. ఈఎంటీలను కూటమి ప్రభుత్వమైనా గుర్తించి ఇంక్రిమెంట్లు చెల్లించాలని ఈఎంటీలు కోరుతున్నారు. వై.ఎస్.జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న నాటికి రాష్ట్రంలో ఉన్న 108 వాహనాల సంఖ్యను భారీగా పెంచారు. కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కుమారుడు కావడంతో జగన్ ప్రభుత్వంలో తమకు ఉద్యోగ భద్రత ఉంటుందని, ప్రతినెలా జీతాలు వస్తాయని ఉద్యోగులు భావించారు. కానీ వారి ఆశలన్నీ ఆడియాశలు అయ్యాయి. జగన్ ప్రభుత్వంలో కూడా మూడు నెలలకు ఒకసారి మాత్రమే సిబ్బందికి జీతాలు చెల్లించేవారు.

ప్రస్తుతం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అదే తీరు కొనసాగుతోంది. ఉద్యోగులకు సరైన జీతాలు, అవి కూడా నెల నెలా వచ్చిన పరిస్థితి లేదని ఉద్యోగులు అంటున్నారు. పేరుకు ఉద్యోగులు, జీతం మాత్రం తీసుకోవడం లేదు. పర్యవసానంగా వడ్డీకి తెచ్చుకొని కుటుంబాన్ని నడిపిస్తున్నారు. వచ్చిన జీతాలు వడ్డీలకే సరిపోతుందని సిబ్బంది వాపోతున్నారు. ప్రతి నెలా సమయానికి ఇంటి అద్దె, విద్యుత్ చార్జీలు చెల్లింపు, పిల్లల చదువుల ఖర్చు, ఇంటి నిర్మాణ ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఒక్కోసారి 24 గంటలు పనిచేసే పరిస్థితి ఉంటుందని, వారాంతపు సెలవులు కూడా సరిగా ఇవ్వడం లేదని అంటున్నారు. కొన్ని కారణాలతో విధుల నుంచి తొలగిస్తున్నారని, వారి స్థానంలో కొత్త వారిని నియమించకపోవడంతో ఉన్న డ్రైవర్లపై అదనపు పని భారం పడుతుందని అంటున్నారు.

తక్షణమే జీతాలు చెల్లించాలి

నాలుగు నెలలుగా జీతాలు లేకుండా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. తక్షణమే ప్రభుత్వం మా బాధలను గుర్తించి పెండింగ్ జీతాలు చెల్లించి, ఇతర అలవెన్సులు ఇవ్వాలి. జీతాలతోపాటు ఏటా ఇంక్రిమెంట్లు వేయాలి.

సాయికుమార్,
108 డ్రైవర్